
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
5
ఆదివారం, 15 డిసెంబరు 2024





అదిగో పులి.. ఇదిగో జాడ..

- కరకగూడెం అడవుల్లో పెద్దపులి సంచారం
- పంగల్‌వాగులో పాదముద్రల గుర్తింపు
- భయాందోళనలో అటవీప్రాంత గ్రామాల ప్రజలు
- ప్రాణహాని చేయదంటున్న అటవీశాఖ అధికారులు

కరకగూడెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలంలోని అటవీ ప్రాంతంలోకి పెద్దపులి వచ్చినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. కొన్ని రోజులుగా భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గత సంవత్సరం కరకగూడెం మండలంలోని మునలమ్మగుట్ట, పద్మాపురం, మోగిలితోగు, చిరుమళ్ల, రాయణపేట, రేగళ్ళ అటవీ ప్రాంతంలో పెద్దపులి అలజడి సృష్టించింది. దాంతో మళ్లీ పెద్దపులి సంచరించే అవకాశం ఉందని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. కరకగూడెం మండలంలోని గొళ్ళగూడెం నార్త్ బీట్ కంపార్టుమెంట్ -2 పంగల్‌వాగులో పెద్దపులి పాదముద్రలను ఏడూళ్ళ బయ్యారం రేంజర్ ఉపేందర్, అనంతారం సెక్షన్ ఆఫీసర్ గోవింద్ గుర్తించారు. శనివారం అటవీశాఖ అధికారులు గొళ్ళగూడెం, చిరుమళ్ళ అటవీ పాంతంలో పెద్దపులి జాడ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో వారు మాట్లాడుతూ.. చత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వాజేడు అటవీ ప్రాంతం నుంచి ఈ ప్రాంతాలకు ఆడపులి టీట్ (ఎద) కోసం డిసెంబరు నెల నుంచి ఫిబ్రవరి నెల వరకు పెద్దపులి సంచరిస్తుందన్నారు. పెద్దపులి సంచరించినప్పటికీ మనుషులకు ఎటువంటి ప్రాణహాని చేయదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. పెద్దపులి దాడిలో మృతి చెందిన పశువులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందిస్తుందని తెలిపారు.

బ్రేక్‌ఫాస్ట్ భళా..



గండుగులపల్లి ఏకలవ్య గురుకులంలో అల్పాహారం చేస్తున్న మంత్రి తుమ్మల

విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం

- ఆర్థికంగా భారమైనా మెనూ చార్జీలు 40శాతం పెంచాం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- గండుగులపల్లి ఏకలవ్య పాఠశాలలో నూతన మెనూకు శ్రీకారం

6

లంచ్ సూపర్..



బోనకల్ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో భోజనం చేస్తున్న భట్టి

ప్రతి విద్యార్థికి మంచి భవిష్యత్తు

- డైట్ చార్జ్‌ను ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- బోనకల్ జ్యోతిబాపూలే గురుకులంలో విద్యార్థులతో కలిసి భోజనం
- రాష్ట్రమంతటా ఒకే డైట్ మెనూ అమలు చేస్తున్నట్టు వెల్లడి

6

టేస్టీ ఫుడ్..



మహ్మదాపురం గిరిజన గురుకులంలో మంత్రి పొంగులేటి..

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

- ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు
- హాస్టళ్లలో కొత్త మెనూతో ప్రభుత్వంపై రూ.500కోట్ల భారం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

6



రాజీ కుదిరిన దంపతులకు మొక్కను అందిస్తున్న జడ్జి రాజగోపాల్

లోక్ అదాలత్ ద్వారా
శాశ్వత పరిష్కారం

- కక్షిదారులకు రాజీమార్గమే రాజమార్గం
- అహాన్ని వీడి భార్యాభర్తలు కలిసి జీవించాలి
- జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్
- జాతీయ లోక్‌అదాలత్‌లో 10,229 కేసులు పరిష్కారం

ఖమ్మం లీగల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయ హాల్‌లో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు లోక్ అదాలత్‌లో రాజీపడ్డ కేసులకు ఎటువంటి అప్పీల్ ఉండదని, సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌తో సమానమని, శాశ్వత పరిష్కారమని తెలిపారు.

జిల్లావ్యాప్తంగా 16బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు ఇరుపక్షాల కక్షిదారులు తమ న్యాయవాదులను సంప్రదించి కేసులు పరిష్కరించే విధంగా కృషి చేయాలని, పోలీసులు సహకరించాలని కోరారు. మోటారు వాహన ప్రమాద బీమా కేసులో పరిష్కారమైన వివిధ కేసులకు జిల్లా ప్రధాన న్యాయాధికారి చేతులమీదుగా అవార్డు పంపిణీచేశారు. ఇటీవలకాలంలో విడాకుల కేసులు పెరగడం పట్ల జిల్లా న్యాయాధికారి స్పందిస్తూ ప్రేమ వివాహాలతోపాటు పెద్దలు కుదిర్చిన వివాహాల్లో కూడా భార్యాభర్తల మధ్య సమన్వయలోపం, మనస్పర్థల వల్ల అతి తక్కువ కాలంలోనే విడాకుల కోసం కోర్టులను ఆశ్రయిస్తున్నారు. నేటి యువత సహనంతో ఓర్పుతో కలిసి మెలిసి ఉండడానికి ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో (మిగతా 6వ పేజీలో)




కేఎంసీ వాహన డ్రైవర్‌పై దాడి

- అక్రమ నిర్మాణం తొలగింపుపై సంబంధీకుల ఆగ్రహం
- సీరియస్‌గా తీసుకున్న కమిషనర్ అభిషేక్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు

6

వి'భజన' హామీ..



'ఉక్కు' సంకల్పం ఉత్తదేనా!?

బయ్యారంలో ఏర్పాటు చేయలేమన్న కేంద్రం

- ఖనిజంలో నాణ్యత లేకపోవడమే కారణమని వెల్లడి
- రాష్ట్ర విభజన చట్టంలోని హామీకి కొర్రీ
- ఇల్లెందు ఏజెన్సీ ప్రాంతవాసుల్లో తీవ్ర నిరాశ
- పరిశ్రమ ఏర్పాటైతే 30 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి
- వనరులు అనుకూలంగా ఉన్నప్పటికీ కేంద్రం వెనకడుగుపై విమర్శలు
- ప్రైవేటు భాగస్వామ్యంతోనైనా నెలకొల్పాలని విన్నపం

ఇల్లెందు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న ఉక్కు కర్మాగారం ఆశలు ఆవిరయ్యాయి. బయ్యారంలో ఉక్కు కర్మాగారం నెలకొల్పడం సాధ్యం కాదని, అక్కడ ఖనిజ నాణ్యత లేకపోవడమే అందుకు కారణమని ఇటీవల లోక్‌సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించడంతో ఉక్కు కర్మాగారం ఆశలు అడుగంటాయి. దీంతో ఇల్లెందు నియోజకవర్గ ఏజెన్సీ ప్రాంతాల్లో నిరాశ అలుముకుంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 13వ షెడ్యూల్‌లో తెలంగాణ రాష్ట్రంలోని బయ్యారం మండలంలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) ఆధ్వర్యంలో రూ. 36వేల కోట్ల వ్యయంతో విశాఖపట్నంలోని మాదిరిగా ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తామని నాడు యూపీఏ ప్రభుత్వం పేర్కొన్న సంగతి తెలిసిందే. కానీ 10 సంవత్సరాలు దాటినా ఉక్కు ఫ్యాక్టరీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. సమీక్షలు, సర్వేల పేరుతో కాలయాపన మినహా కర్మాగారాం ఏర్పాటుకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

'బయ్యారం ఉక్కు-తెలంగాణ హక్కు' అంటూ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటాలకు ఉత్ప్రేరకంగా మారిన స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు విభజన చట్టంలో హామీ ఇవ్వడం ఎన్నో ఆశలను రేకెత్తించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలీనం చేయడంతో పాటు పోలవరం ప్రాజెక్టు కారణంగా ఆదివాసీ గిరిజనులు నిరాశ్రయులుగా మారుతున్నప్పటికీ ఉక్కు కర్మాగారంపై ఆశలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజానీకం ఎలాంటి ఆందోళనలకు పూనుకోలేదు. దాదాపు 30 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న ఆశతో దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న ఏజెన్సీ ప్రజానీకానికి తాజా ప్రకటన అశనిపాతంగా మారింది.

ఆనాడు ఎందుకంత డిమాండ్..?

బయ్యారం ఇనుప ఖనిజం తక్కువ నాణ్యత కలిగి ఉంటే గతంలో ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులు బయ్యారం ఇనుప ఖనిజం కోసం ఎందుకు వెంపర్లాడారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబీకులు రక్షణ స్టీల్స్ పేరుతో మూడు జిల్లాల పరిధిలో ఇనుప ఖనిజం ఉన్న దాదాపు 2 లక్షల ఎకరాల భూములు ఎందుకు కేటాయింపు చేసుకున్నారని, జగ్గయ్యపేటకు ఎందుకు లక్షలాది టన్నుల ఖనిజ సంపదను తరలించుకుపోయారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు బయ్యారం ఇనుప ఖనిజం కోసం అర్రులు చాస్తుండగా, సెయిల్ ఎందుకు వెనకడుగు వేస్తోందన్న ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి. దాదాపు 30 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్న ఆశతో ఉక్కు కర్మాగారం కోసం స్థానికులు ఎదురు చూస్తున్నారు.

విశాఖ ఉక్కు కంటే లాభసాటి..

విశాఖపట్నంలోని ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టడంతో బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఆశలు అడుగంటడం మొదలైంది. నిజానికి విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీతో (మిగతా 6వ పేజీలో)

లక్ష్యానికి చేరువలో
'బీటీపీఎస్'

- ఒడిదుడుకులను తట్టుకొని విద్యుదుత్పత్తిలో ముందంజ



మణుగూరు రూరల్ డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మండలంలోని భద్రాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ ఈ ఏడాది నిర్దేశించిన విద్యుదుత్పత్తి సాధనలో లక్ష్యానికి చేరువలో ఉంది. బీటీపీఎస్ మొత్తం నాలుగు యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్ 270మెగావాట్ల పవర్‌ను జనరేట్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. నాలుగు యూనిట్లు సాఫీగా సాగితే 1080 మెగావాట్ల విద్యుదుత్పత్తి అయ్యేది. ఈ స్టేషన్ నిర్మాణం పూర్తయి విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేయడమే కాకుండా కమర్షియల్ ఆపరేషన్ డేను 2020లో చేయడం జరిగింది. ఆనాటి నుంచి అధికార బృందం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతూ సమ్యలను పరిష్కరించుకుంటూ విద్యుత్ ఉత్పత్తికి అంతరాయాలు లేకుండా చేస్తున్నారు.

ఉత్పత్తిలో ముందంజ

ఆదినుంచి అంటే నిర్మాణ దశనుంచి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ వచ్చిన బీటీపీఎస్ నిర్మాణాలు పూర్తయి విద్యుదుత్పత్తిని సాధిస్తున్న తరుణంలో అనుకోని విధంగా అవాంతరం వచ్చింది. బీటీపీఎస్ యూనిట్ వన్‌లో పవర్ జనరేట్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అకస్మాత్తుగా ఈ ఏడాది జూన్‌లో ప్రమాదం సంభవించింది. దీంతో యూనిట్-1లో ఉత్పత్తి నిలిచిపోయింది. ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నప్పటికీ మిగిలిన 3 యూనిట్లను ఎలాంటి బ్రేక్ డౌన్‌లు లేకుండా అధికారులు, ఇంజనీర్లు శ్రమిస్తున్నారు.

నాణ్యమైన బొగ్గు ఉంటే మరింత ఉత్పత్తి

బీటీపీఎస్‌కు మణుగూరు ఏరియా నుంచి బొగ్గు వినియోగిస్తున్నారు. కాగా సరఫరా అయ్యే కోల్‌లో నాణ్యత లోపించడం వల్ల అనుకున్న స్థాయిలో విద్యుదుత్పత్తి చేయలేకపోతున్నట్లు ఉన్నతాధికారులే పేర్కొంటున్నారు. సింగరేణి యాజమాన్యం, బీటీపీఎస్ అధికారులు ఈ సమస్యను అధిగమించాల్సి ఉంది. సహజంగా థర్మల్ ప్రాజెక్టుకు జీ10 గ్రేడ్ రకం నాణ్యమైన బొగ్గును వాడుతుంటారు. దీని ద్వారా మంచి విద్యుదుత్పత్తి సాధ్యం అవుతుంది. కాగా మణుగూరు సింగరేణి బొగ్గు గనుల నుంచి జీ -1, 2, 5, 9 గ్రేడ్‌ల బొగ్గు మాత్రమే లభించడంతో లక్ష్యానికి చేరువకాలేక పోతున్నట్లు సీఈ బిచ్చన్న పేర్కొంటున్నారు.

గ్రూప్-2 పరీక్షలకు సర్వం సిద్ధం

- నేడు, రేపు ఇరు జిల్లా కేంద్రాల్లో నిర్వహణ
- ఖమ్మంలో 85, కొత్తగూడెంలో 38 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 41,500 మంది అభ్యర్థులు
- ఒక్క నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించరు..

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షలు ఆది, సోమవారాల్లో జరగనున్న నేపథ్యంలో ఇరు జిల్లా కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3.00గంటల నుంచి సాయంత్రం 5-30 వరకు రెండు విడతల్లో పరీక్షలు జరగనున్నాయి. ఖమ్మంజిల్లాలో 28వేల 101 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. నగరంతోపాటు వివిధ ప్రాంతాల్లో మొత్తం 85పరీక్షా కేంద్రాలు సిద్ధం చేశారు. ఖమ్మంలోని పాత కలెక్టరేట్‌లో ప్రశ్నపత్రాల స్ట్రాంగ్ రూంను ఏర్పాటు చేశారు. విజయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వి. చిన్నయ్య రీజినల్ కోఆర్డినేటర్-1గా, 40 పరీక్షా కేంద్రాలు, ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి.రాజకుమార్ రీజనల్ కో ఆర్డినేటర్-2గా 45పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించనున్నారు. గ్రూప్-2 పరీక్ష నిర్వహణకు కొత్తగూడెం జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ జితేష్ వీ పాటిల్ తెలిపారు. జిల్లాలో మొత్తం 13,465మంది అభ్యర్థులు గ్రూప్ 2 పరీక్షకు హాజరుకానున్నారని ఇందుకు కొత్తగూడెం పట్టణంలో మొత్తం 38పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అభ్యర్థులందరూ పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రాల వద్దకు చేరుకోవాలని వివరించారు.

ఒక్కనిమిషం నిబంధన

పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్‌లో 8-30నుంచి, మధ్యాహ్నం సెషన్‌లో 1-30నుంచి అనుమతించడం జరుగుతుంది. పరీక్ష కేంద్రాల గేటు ఉదయం సెషన్‌లో 9-30గంటలకు, మధ్యాహ్నం సెషన్‌లో 2-30గంటలకు మూసి వేస్తారు. దీని తర్వాత పరీక్ష కేంద్రాల లోనికి ఎవరినీ అనుమతించబోమని, ఒక్కనిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని అధికారులు చెబుతున్నారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు క్యాలిక్యులేటర్, సెల్‌ఫోన్, పెన్ డ్రైవ్, బ్లూ టూత్ డివైజెస్, జ్యువెలరీ, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లాంటివి అనుమతి లేదు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ధరించాల్సి ఉంటుంది.



కాంతులీనిన లకారం

- ఘనంగా ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం
- ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి తుమ్మల
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

6

విశ్వవిఖ్యాత నటుడు ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం నగరంలోని లకారం ట్యాంక్‌బండ్‌పై శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మంత్రి తుమ్మల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చిన తరువాతనే దేశ రాజకీయాల్లో పెనుమార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకొని తాను 40 ఏళ్లుగా రాజకీయాల్లో ప్రజలకు సేవ చేస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం టౌన్


2023లో ఢిల్లీలో జరిగిన ఐడబ్ల్యూపీఎల్ లీగ్ ట్రోఫీని ముద్దాడుతున్న సురేష్



వీల్‌చైర్ ప్లేయర్

వీల్‌చైర్ క్రికెట్‌లో అదరగొడుతున్న దివ్యాంగుడు

- వైకల్యం ఉన్నా.. ఆత్మవిశ్వాసంతో ముందుకు
- జాతీయస్థాయిలో సత్తాచాటుతున్న కూసుమంచి మండలవాసి

కూసుమంచి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఎవరైనా తాము ఎంచుకున్న క్రీడలో మెరుగైన ప్రతిభ చాటేందుకు ప్రయత్నిస్తారు. అందుకోసం అహర్నిషలు కష్టపడుతారు. తమ ప్రయాణంలో అవరోధాలు ఎదురైనా వెరవకుండా ముందుకు సాగుతారు. జనక సురేష్ విషయానికొస్తే ఒకవైపు అంగవైకల్యం ప్రతిబంధకంగా మారినా ప్రతిభ చాటాలన్న ఏకైక లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు.

జనక సురేష్‌కు క్రికెట్ అంటే అమితమైన ఇష్టం. దీంతో స్నేహితుల సమాచారంతో ఐదేళ్ల క్రితం వీల్‌చైర్ క్రికెట్‌లో హైదరాబాద్‌లో పారా స్పోర్ట్ అథారిటీ రాయల శ్రీధర్ వద్ద కోచింగ్ తీసుకున్నాడు. ఎలాగైనా సత్తాచాటాలన్న కసితో క్రికెట్ బరిలోకి దిగి తెలంగాణ జట్టులో స్థానం సంపాదించాడు. ఖమ్మం జిల్లానుంచి ఇద్దరు ఎంపిక కాగా అందులో ఖమ్మం నగరానికి చెందిన సంయుద్దీన్ కాగా మరొకరు సురేష్. జాతీయస్థాయిలో ఆడిన ప్రతీ టోర్నీల్లోనూ ఆకట్టుకుంటున్నాడు. తమిళనాడు, ఢిల్లీ, రాజస్థాన్, ఆంధ్ర, ముంబై, సూరత్ టోర్నీల్లో పాల్గొని సత్తాచాటాడు. ఇప్పటికి 22 మ్యాచ్‌లు ఆడిన సురేష్ 355 పరుగులు సాధించాడు. ఇటీవల డిసెంబరు 2 నుంచి 6 తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ నగరంలో జరిగిన దివ్యాంగుల ప్రీమియర్ లీగ్ (ఐడబ్ల్యూపీసీ)లోనూ రాణించాడు. ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచి మ్యాన్ ఆఫ్ మ్యాచ్ సాధించాడు.

కూసుమంచి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన జనక సురేష్ ఓ నిరుపేద దళిత కుటుంబంలో పుట్టాడు. ఊహ తెలియని ప్రాయంలోనే పోలియో మహమ్మారి బారిన కుడికాలు పడిపోయింది. ఒకవైపు కష్టాలు వెంటాడుతున్నా.. ఆత్మవిశ్వాసంతో ఆటలను ప్రేమించాడు. వైకల్యం తన శరీరానికేనని, ప్రతిభకు కాదని నిరూపించి పల్లెటూరు నుంచి జాతీయస్థాయికి ఎదిగాడు. వైకల్యాన్ని ఈజీగా జయిస్తూ క్రికెట్‌లో అదరగొడుతున్నాడు. ప్రతి టోర్నీలోనూ ప్రతిభచాటుతూ జిల్లా ఖ్యాతిని ఇనుమడింపచేస్తున్నాడు.


ఇటీవల భోపాల్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకుంటూ..

నిరుపేద కుటుంబం నుంచి

దివ్యాంగుల క్రికెట్‌లో రాణిస్తున్న జనక సురేష్‌ది నిరుపేద కుటుంబం. కష్టపడి పనిచేస్తే తప్ప పూటగడవని పరిస్థితి. తల్లిదండ్రులు రాధ, వెంకన్న ఇరువురు కూలి పనిచేస్తారు. ఆర్థికంగా తనకు మద్దతు ఇస్తే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తానని సురేష్ అంటున్నాడు.

రామయ్యను దర్శించుకున్న కర్ణాటక ఆధ్యాత్మికవేత్త

- రూ.10.79 లక్షల విలువైన రాజదండం అందజేత
- కృత్తికా దీపోత్సవానికి అంకురార్పణ
- నేడు నిత్యకల్యాణం నిలిపివేత


రాజదండాన్ని దేవస్థానం ఈవోకు అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారిని కర్ణాటక రాష్ట్రంలోని ముద్దెనహళ్లికు చెందిన ఆధ్యాత్మికవేత్త సద్గురు మధుసూదన్‌సాయి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి 114.65 గ్రాముల బంగారంతో తయారు చేసిన రాజదండంను ఆలయ ఈవో రమాదేవికి అందజేశారు. అలాగే శ్రీ సీతారామచంద్రస్వామి వారిని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు కూడా దర్శించుకున్నారు. అలాగే ఆదివారం కృత్తికా దీపోత్సవం సందర్భంగా శనివారం అంకురార్పణలో భాగంగా గోదావరి నుంచి తీర్దబిందెతో నీటిని తెచ్చి యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే నేడు కృత్తికా దీపోత్సవం సందర్భంగా స్వామి వారికి నిత్యకల్యాణం నిలిపివేస్తున్నట్లు ఆలయాధికారులు వెల్లడించారు. అదేవిధంగా వారాంతం కావడంతో భద్రాద్రి రామయ్యను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

కామన్ డైట్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీపీ


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న పోలీస్ కమిషనర్

ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అనవసరమైన ఫోన్‌కాల్స్, మెసేజ్ లింకులు ఓపెన్ చేయకూడదని, ఫోన్, బ్యాంక్ అకౌంట్ సైబర్ నేరగాళ్లకు చిక్కుతుందని, దాని ద్వారా మన అకౌంట్‌లోని డబ్బు పోతుందని, సైబర్ నేరాలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ విద్యార్థులకు సూచించారు. శనివారం నగరంలోని తెలంగాణ మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కామన్ డైట్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ ఒక్కరు బలమైన ఆహారం తీసుకుంటేనే శారీరకంగా, మానసికంగా ఎదుగుతారన్నారు. పోలీసులు నిరంతరం మీ సేవల్లో ఉంటారని, ఎవరికైనా ఆపద వస్తే డయల్ 100, సైబర్ నేరాలకు 1930కు ఫోన్ చేయాలని తెలిపారు. మాదకద్రవాల వాడకం వల్ల జరిగే నష్టాలను వివరించారు. భవిష్యత్తు నాశనంచేసే మాదకద్రవ్యాల జోలికి వెళ్లకూడదని అన్నారు. పాఠశాలలో ఆహార పదార్థాలను, కూరగాయలను, పచ్చళ్ల, సరుకులను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి పిల్లల సౌకర్యాలను, విద్యాబోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మీ, అర్బన్ సీఐ భానుప్రకాష్, ఆర్ఐవహీద్, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.



యువత మత్తుకు అలవాటు పడొద్దు

- 6వ అదనపు జిల్లా జడ్జీ మారగాని శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు అలవాటు పడొద్దని, చట్టాలపై అవగాహన ఉంటే మంచి జీవితం సాధ్యమవుతుందని 6వ అదనపు జిల్లా జడ్జీ మారగాని శ్రీనివాస్ అన్నారు. శనివారం సత్తుపల్లి కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్ ద్వారా 684కేసులు పరిష్కారమయ్యాయి. మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని, చట్టాలపై అవగాహన కలిగి ఉంటే మోసపోరని, అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జీ మీరాఖాసీంసాహెబ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జీలు ఎస్‌కే.అయేషాషరీన్, వడ్డె లావణ్య, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జే.గోపాలరావు, పట్టణ సీఐ టి.కిరణ్, కోర్టు ఏవో, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాలేరు ప్రతిపాదిత రైల్వేలైన్‌ను

పునఃపరిశీలించాలంటూ విజ్ఞప్తి

కూసుమంచి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గం గుండా ప్రతిపాదించిన కొత్త రైల్వే లైన్ కారణంగా ఈప్రాంత రైతులకు, ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఈఅంశాన్ని ఢిల్లీ వరకు తీసుకెళ్లారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీల బృందంతో కలిసి రైల్వేశాఖ మంత్రి అశ్వని వైష్ణవ్‌ను కలిశారు. ఈమేరకు వినతిపత్రం అందించారు. పాలేరు నియోజవకవర్గం గుండా కొత్త రైల్వేలైన్ వల్ల ఇబ్బందులు వివరించారు. అతిఖరీదైన సుడా స్థలాల్లో నుంచి వెళ్లిన డోర్నకల్ మిర్యాలగూడెం రైలు మార్గాన్ని మార్చాలని కోరారు. ప్రత్యామ్నాయంగా డోర్నకల్ వయా వెన్నారం, మన్నెగూడెం, మరిపెడ, మోతెమీదుగా కొత్తలైన్ నిర్మించాలని కోరారు.

పశుసంపద అభివృద్ధికి కృషి చేయాలి

వైరా, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పశుసంపదను మరింతగా అభివృద్ధి చేయాలని తెలంగాణ రాష్ట్ర పశుసంవర్థకశాఖ సంచాలకుడు డాక్టర్ గోపి సిబ్బందికి సూచించారు. జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి కేవీ.నారాయణతోపాటు శనివారం వైరా మండలంలోని స్టేజీ పినపాక గ్రామంలో జిల్లా పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశుగణన నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాభివృద్ధి అధికారి డాక్టర్ కె.కిషోర్, వైరా డాక్టర్ ఎం.రాకేష్‌కుమార్, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జి.సుబ్బారావు, సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

16నుంచి జిల్లాస్థాయి

సీఎం కప్ క్రీడలు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీలను ఈ నెల 16నుంచి 21వరకు నిర్వహించనున్నట్టు డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 7,8 తేదీల్లో గ్రామస్థాయిలో, 10, 11, 12 తేదీల్లో మండల, మునిసిపాలిటీ స్థాయిలో పోటీలు నిర్వహించామని, ఆయా పోటీల్లో విజయం సాధించిన వారు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. జిల్లాస్థాయిలో క్రీడాకారులకు ఈ క్రింది పోటీలు నిర్వహించనున్నారు

- 16న కబడ్డీ, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, వాలీబాల్(మెన్), స్విమ్మింగ్(పురుష, మహిళ), టేబుల్‌టెన్నీస్, కరాటే (బాలురు, బాలికలు),
- 17న కబడ్డీ(ఉమెన్), బ్యాడ్మింటన్, ఉషు(బాలురు, బాలికలు)
- 18న అథ్లెటిక్స్, లాన్‌టెన్నీస్, రోయింగ్, షూటింగ్, చెస్(బాలురు, బాలికలు), జిమ్నాస్టిక్స్ (మెన్,ఉమెన్),
- 19న ఆర్చరీ(బాలురు, బాలికలు), వాలీబాల్, హ్యాండ్‌బాల్(ఉమెన్), తైక్వాండో(మెన్), నెట్‌బాల్, ఫుట్‌బాల్ (మెన్, ఉమెన్)
- 20న ఖో-ఖో, హాకీ, జూడో, హ్యాండ్‌బాల్, పవర్‌లిఫ్టింగ్ (మెన్), కిక్‌బాక్సింగ్, సైక్లింగ్(మెన్ ఉమెన్),
- 21న బాక్సింగ్, యోగా, వెయిట్‌లిఫ్టింగ్(మెన్ ఉమెన్), బాస్కెట్‌బాల్, ఖో-ఖో(ఉమెన్) విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులను ఈ నెల 27 నుంచి జనవరి 2 వరకు రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సంబంధిత క్రీడా విభాగాల కోచ్‌లనుగానీ స్టేడియంలోని క్రీడల కార్యాలయాన్ని గాని సంప్రదించాలని కోరారు.

17న భద్రాద్రి జిల్లా స్థాయి

క్రాస్ కంట్రీ చాంపియన్ షిప్ పోటీలు

చుంచుపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న భద్రాద్రి జిల్లాలోని పాల్వంచ చింతల చెరువు లేక్‌పై జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహిధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు 16 ఏళ్లలోపు బాల, బాలికలకు రెండు కిలో మీటర్ల పరుగు పందెం, 18 ఏళ్లలోపు బాలురకు ఆరు కిలోమీటర్లు, బాలికలకు నాలుగు కిలో మీటర్లు, 20ఏళ్ల లోపు బాలురకు ఎనిమిది కిలోమీటర్లు, బాలికలకు ఆరు కిలో మీటర్ల పరుగుపందెం నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీల్లో ప్రతిభచూపిన వారికి మెడల్స్‌తోపాటు, ధ్రువపత్రాలను అందజేస్తున్నట్టు తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22న నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్ షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. జిల్లాలోని అథ్లెటిక్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు అథ్లెటిక్ కోచ్ పి.నాగేందర్ 8328616737 ను సంప్రదించాలని కోరారు.

తెలంగాణ ఉద్యమంలో మోరే భాస్కర్ పాత్ర కీలకం

వద్దిరాజు, వనమా, రేగా

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో మోరే భాస్కర్ పాత్ర ఎంతో కీలకమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. శనివారం రామవరంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మోరే భాస్కర్ దశదిన కార్యక్రమంలో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో భాస్కర్ క్రియాశీల పాత్రను పోషించినట్లు గుర్తు చేశారు. అనంతరం కేటీఆర్ ఆదేశానుసారం రూ.5 లక్షల చెక్కును ఎంపీ వద్దిరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ కారులు బండి రాజుగౌడ్, లగడపాటి రమేష్‌చంద్, హుస్సేన్, మడ్డెల శివకుమార్, మోరే రమేష్‌కుమార్, నాయకులు అనుదీప్, శ్రీకాంత్, రమాకాంత్, శ్రీధర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్థానాన్ని

ఎవరూ భర్తీ చేయలేరు..

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- నగరంలో ఘనంగా ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం

ఖమ్మం టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సినీ, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాజకీయాలు ఉన్నంతకాలం ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్‌పై శనివారం రాత్రి ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకల్లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఎన్టీఆర్ వ్యక్తిత్వం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని, ఆయన నిబద్ధత, నిజాయితీ, అనుకున్నది సాధించే పట్టుదల, కృషిని ఆదర్శంగా తీసుకొని 40ఏళ్లుగా రాజకీయాల్లో ప్రజలకు సేవ చేయగలుగుతున్నానన్నారు.

ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చిన తరువాతనే దేశ రాజకీయాల్లో పెనుమార్పులు జరిగాయన్నారు. సినీనటుడిగా ఆయనను ఆదరించిన ప్రజలు రాజకీయాల్లోనూ అభిమానించి, ఆశీర్వదించారన్నారు. దేశ రాజకీయాల్లో ఏక పార్టీ లేని వాతావరణాన్ని ఆయన సృష్టించారన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను దేశంలోని అన్ని రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఎన్టీఆర్ రాజకీయాల్లో తనకు అవకాశం ఇచ్చినందువల్లే తెలుగు గంగ ప్రాజెక్ట్ నుంచి ఇప్పటివరకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టే అవకాశం తనకు కలిగిందని తుమ్మల పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, టీడీపీ నేతలు కేతినేని హరీష్, వానిరెడ్డి రామనాథం, కుతుంబాక కృష్ణప్రసాద్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు మానుకొండ రాధాకిషోర్, నల్లమల వెంకటేశ్వరరావు, మందడపు సుధాకర్, వేజెళ్ల సురేష్ కార్యక్రమ నిర్వాహకులు రావూరి సైదుబాబు, ఎలగొండ స్వామి పాల్గొన్నారు.

కేఎంసీ వాహన డ్రైవర్‌పై దాడి

ఖమ్మం సంక్షేమవిభాగం/క్రైం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రహదారి, ప్రైవేట్ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు జరిపారని ప్రజావాణిలో వరుస ఫిర్యాదులు రావటంతో స్పందించిన అధికారులు అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసి తిరిగి వస్తుండగా కొందరు వ్యక్తులు వాహనాలను అడ్డుకుని జేసీబీ డ్రైవర్, హెల్పర్‌పై దాడి చేసి వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ సంఘటన శనివారం ఖమ్మంలో చోటు చేసుకుంది.

ఖమ్మం నగరంలోని చైతన్యనగర్‌లో రోడ్డును, ప్రైవేట్ స్థలాన్ని ఆక్రమించి షెడ్డు నిర్మాణం చేయటంతో ప్రైవేట్ స్థలం యజమాని పుతుంబాక జానకిదేవి, రమేశ్ బాబు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక అధికారులు నరేష్ సిబ్బందితో కలిసి శనివారం ఉదయం 7గంటల సమయంలో అక్రమ నిర్మాణం చేసిన షెడ్డును కేఎంసీ జేసీబీలతో కూల్చివేశారు.

అనంతరం చైతన్యనగర్ నుంచి ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయానికి తిరిగి వస్తుండగా ప్రవీణ్, రవితోపాటుగా మరో నలుగురు వ్యక్తులు స్టీల్ రాడ్‌లు పట్టుకొని ద్విచక్రవాహనాలతో జేసీబీ వాహనాన్ని వెంబడించారు. ఎన్టీఆర్ సర్కిల్‌కు వాహనం రాగానే దానిని అడ్డగించి జేసీబీ డ్రైవర్ ప్రకాశ్, హెల్పర్ నవీన్‌పై విచక్షణ రహితంగా దాడి చేశారు. వాహనాన్ని ధ్వంసం చేశారు. దీంతో బాధితులు ఖమ్మం రెండో పోలీసుస్టేషన్‌కు వెళ్లగా స్టేషన్‌లోనూ జేసీబీ డ్రైవర్‌పై మరోసారి దాడి చేశారు. డ్రైవర్‌కు తీవ్రగాయాలు కావటంతో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పోలీసుకమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రవీణ్, రవితోపాటుగా మరికొందరిపై కేసులు నమోదు చేయించారు. కాగా ఈ ఘటనపై రౌడీషీటర్ కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అరెస్టు చేయవద్దని డిమాండ్ చేశారు. టూటౌన్ సీఐ బాలకృష్ణను వివరణ కోరగా స్టేషన్‌లో ఎలాంటి సంఘటన జరగలేదని, స్థలం వద్ద మాత్రమే దాడి జరిగిందని చెప్పారు.

ప్రతి విద్యార్థికి మంచి భవిష్యత్తు

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

బోనకల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న ప్రతీ విద్యార్థికి మంచి భవిష్యత్‌ను ఇవ్వడమే ప్రజాప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బోనకల్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాలలో శనివారం ఆయన కొత్త మెనూ డైట్ చార్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో మాటామంతీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టిసారించి పిల్లలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటుందని తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

అనంతరం భట్టి విక్రమార్క విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ గురుకులాల్లో చదివే పిల్లలకు పౌష్టికాహార లోపం తలెత్తితే భవిష్యత్ అంధకారం అవుతుందని తాము గుర్తించామన్నారు. గత ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేసినందున ప్రజాప్రభుత్వం ఏర్పాటుకాగానే సీఎం రేవంత్‌రెడ్డి, తాను, సహచర మంత్రులంతా పిల్లలకు మెరుగైన పౌష్టికాహారాన్ని అందించాలన్న లక్ష్యంతో కమిటీ వేశామన్నారు. 15రోజుల్లోనే నివేదికను తెప్పించుకొని గతం కన్నా 40శాతం డైట్ చార్జీలను పెంచామన్నారు. గత ప్రభుత్వం మూడు నుంచి ఏడో తరగతి వరకు రూ.950డైట్ చార్జీలు ఇవ్వగా తమ ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.1330కు పెంచాయని, 8నుంచి 10వతరగతి వరకు గతంలో రూ.1100ఉండగా నేడు రూ.1540కు పెంచామని, ఇంటర్ నుంచి డిగ్రీ వరకు గతంలో రూ.1500నుంచి రూ.2100 పెంచామని స్పష్టం చేశారు. ఆర్థిక భారమైనా రేపటి భావితరాల అభివృద్ధి కోసం కొత్త మెనూను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర మంతటా డైట్ మెనూ ఒకేవిధంగా ఉండేటట్లు అమలు చేసేందుకు గానూ విద్యార్థులతో కలిసి భోజనం చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం ఏడాది కాలంలో విద్య కోసం రూ.70కోట్లు కేటాయిస్తే తాము ఈ ఏడాదికి రూ.5వేల కోట్లు కేటాయించామన్నారు. యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.


మెనూ చార్ట్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం ఎలా ఉందని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రేష్ట, ఆర్డీవో నర్సింహారావు, ఆర్‌సీవో బ్యూలారాణి, ఎంఈవో దామాల పుల్లయ్య, ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, తహసీల్దార్ పొన్నం చందర్, మాజీ జడ్పీటీసీ మోదుగు సుధీర్‌బాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. కాగా, భట్టి బోనకల్ మండలంలో శనివారం పలు గ్రామాల్లో రూ.20.94 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

దమ్మపేట, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో వుండి చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం మెనూ చార్జీలు పెంచిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో ఏకలవ్య పాఠశాలలో ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన మెనూను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ జితేష్ వీ పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్‌తో కలిసి శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తేనే ఆరోగ్యంగా వుంటూ చదువుకోగలరని అన్నారు. ప్రభుత్వానికి భారమైనా మెనూ చార్జీలు 40శాతం పెంచటంతో ప్రభుత్వంపై రూ.500కోట్లు భారం పడుతుందన్నారు. 16సంవత్సరాలుగా మెనూ చార్జీలు పెంచలేదని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మెనూ చార్జీలు పెంచటం జరిగిందన్నారు.

మంచి విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని విద్యార్థులు అవకాశాలను వినియోగించుకొని ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. తద్వారా మీ కుంటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయన్నారు. రాష్ట్రంలో ఏకల వ్య పాఠశాలలు రెండు మంజూరు కాగా.. తొలుత గండుగులపల్లిలోనే నిర్మాణం చేసి ప్రారంభించటం జరిగిందని తుమ్మల గుర్తు చేశారు. గండుగులపల్లి ఏకలవ్య పాఠశాలను రాష్ట్రంలోనే ఆదర్శంగా గుర్తింపు తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను తుమ్మల అభినందించారు.

అనంతరం మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్ విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అంతకు ముందు పాఠశాలలోని స్టాక్ రూం పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

తిరుమలాయపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య ను అందించేందుకు కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నట్టు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని మహ్మదాపురంలో శనివారం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల, కళాశాలలో కామన్ డైట్ మెనూను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదవారి పిల్లలు కూడా ధనికుల పిల్లల్లా చదవాలనే లక్ష్యంతో ప్రభుత్వం కాస్మోటిక్ డైట్ చార్జీలు పెంచిందన్నారు దీంతో ప్రభుత్వానికి అదనంగా సుమారు రూ.500కోట్ల భారం పడుతుందన్నారు. రేపటి భావితరాల అభివృద్ధి కోసం కొత్త మెనూను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలే కాక ఇవ్వని హామీలు కూడా అమలు చేస్తున్నామన్నారు.

గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదపిల్లల గురించి పట్టించుకోలేదని ఇందిరమ్మ రాజ్యంలో హాస్టల్ విద్యార్థులకు డైట్ చార్జీలు 40శాతం, కాస్మోటిక్ చార్జీలు 250శాతం పెంచామన్నారు. ప్రతి నియోజకవర్గంలో రూ.150కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేస్తున్నట్టు తెలిపారు. అన్ని సదుపాయాలు ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. 50నుంచి 54వరకు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి ఈఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయించామని, త్వరలో నిర్మాణ పనులు చేపడతామన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం

అంతకముందు పొంగులేటి పాఠశాలలోని విద్యార్థుల రిజిస్టర్‌ను, స్టాక్‌రూంను పరిశీలించారు. వంటసామగ్రి పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. అలాగే రూ.5కోట్లతో జీ ప్లస్ 3గా నిర్మిస్తున్న పాఠశాల కాంప్లెక్స్, ప్రిన్సిపాల్, స్టాఫ్ క్వార్టర్లను పరిశీలించారు. నాణ్యతలో రాజీలేకుండా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, సీత శంకర్, డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి, ఈఈ తానాజీ, తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ప్రిన్సిపాల్ భాస్కర్, రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, ఏఎంసీ వైస్‌చైర్మన్ వనవాసం నరేందర్ రెడ్డి, బి.నరసయ్య, ఓర వెంకటేశ్వర్లు, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉక్కు సంకల్పం ఉత్తదేనా!?

(5వ పేజీ తరువాయి)

పోలిస్తే బయ్యారం ఉక్కు కర్మాగారం లాభసాటిగా ఉంటుందనడం అతిశయోక్తి కాదు. విశాఖ ఉక్కు కర్మాగారానికి ముడి ఖనిజంతో పాటు డోలమైట్ బొగ్గు, విద్యుత్ వనరులను తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకుంటున్నారు. అదే బయ్యారం ఏరియాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు పూర్తి స్థాయిలో ఇనుప ఖనిజం లభ్యమవుతుందని మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) గుర్తించింది. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల పరిధిలో 56,690 హెక్టార్ల భూముల్లో ఖనిజాలు ఉన్నట్లు ఎన్ఎండీసీ గుర్తించింది. అంతేకాక బయ్యారానికి 50 కిలోమీటర్ల పరిధిలోనే సింగరేణి కాలరీస్ బొగ్గు, మాదారం డోలమైట్ ఖనిజం, మూడు జిల్లాల పరిధిలో ఇనుప ఖనిజం నిల్వలు ఉన్నాయి. రైలు మార్గం, విద్యుత్, నీటి సౌకర్యాలతో పాటు భూమి సైతం సమృద్ధిగా ఉంది. అయినా కేంద్ర ప్రభుత్వం విముఖత చూపటంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

బయ్యారంలో ఉక్కు కర్మాగారానికి ముడి ఇనుపఖనిజాన్ని సమీపంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగదల్‌పూర్ ఏరియా బైలడిల్లా నుండి 180 కిలోమీటర్ల రైలు మార్గం ఏర్పాటు చేసుకొని దిగుమతి చేసుకొనే అవకాశాలు ఉన్నాయి. సింగరేణి కాలరీస్ సైతం బొగ్గు సరఫరాకు సిద్ధంగా ఉన్నప్పటికీ కేంద్రం నుంచి రిక్త హస్తమే మిగలడం విచారకరం. తెలంగాణ ప్రజాప్రతినిధులు ప్రధానమంత్రిని, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులను ఎన్ని పర్యాయాలు కలిసినా వారి మొర అరణ్యరోదనగానే మిగిలింది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెయిల్, సింగరేణి, కేంద్ర పరిశ్రమల శాఖ మెకాన్ సంస్థలు సర్వేలతో పాటు ఫ్యాక్టరీ ఏర్పాటుకు డీపీఆర్‌లు రూపొందించినప్పటికీ సెయిల్ నాణ్యత తక్కువ ఉందంటూ సాకులు చెప్పడం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే తాజాగా పార్లమెంట్ వేదికగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సైతం సెయిల్ నిర్ణయాన్ని బలపరిచేలా ఉక్కు ఫ్యాక్టరీ నెలకొల్పడం సాధ్యం కాదంటూ ప్రకటించడం ఏజెన్సీ ప్రాంతవాసులను ఆందోళనకు గురిచేస్తోంది.

ప్రైవేటుకు అవకాశం...

కేంద్రం వెనుకడుగు వేయటంతో ప్రైవేట్‌రంగ ఉక్కు ఉత్పాదక సంస్థలు సైతం బయ్యారంలో కర్మాగారం నెలకొల్పేందుకు ఆసక్తి కనబర్చాయి. జిందాల్ లాంటి సంస్థల ప్రతినిధులు బయ్యారం ఖనిజ సంపదను పరిశీలించి వెళ్లడమే ఇందుకు ఉదాహరణ. ప్రభుత్వం బయ్యారం కర్మాగారం అంశాలపై సంబంధిత శాఖలనుంచి నివేదిక కోరినట్లు తెలిసింది. ప్రభుత్వ రంగంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేసే పరిస్థితులు లేకపోతే కనీసం ప్రైవేటుతో జాయింట్ వెంచర్‌లో నైనా ఉక్కుకర్మాగారం ఏర్పాటు చేయాలనికోరుతున్నారు.

లోక్ అదాలత్ ద్వారా

శాశ్వత పరిష్కారం

(5వ పేజీ తరువాయి)

న్యాయాధికారులు కె.ఉమాదేవి, వెంపటి అపర్ణ, అర్చనకుమారి, దేవినేని రాంప్రసాద్‌రావు, శ్రీనయ్య, చంద్రశేఖరరావు, ఎం.కల్పన, వి.శివరంజని, బెక్కం రజని, ఏపూరి బిందుప్రియ, రాళ్లబండి శాంతిలత, వినుకొండ మాధవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావుతోపాటు ఇన్సూరెన్స్ కంపెనీల న్యాయవాదులు స్వర్ణ రాంబాబు, కొత్తపల్లి రామారావు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, హరేరామ హరేకృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో కక్షిదారుల సౌకర్యార్థం మంచినీటి వసతి, అన్నదానం ఏర్పాటు చేశారు. ఖమ్మం, సత్తుపల్లి, మధిర కోర్టుల పరిధిలో మొత్తం 10,229 కేసులు పరిష్కారమయ్యాయి.

ఎన్ఆర్ఐ జంటను కలిపిన లోక్ అదాలత్

జర్మనీలో ఉంటున్న ఓ ఎన్ఆర్ఐ జంటను జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయాధికారులు ఒక్కటి చేశారు. ఖమ్మం నగరానికి చెందిన గుడిపూడి హరికృష్ణ, గుడిపూడి స్వాతి జర్మనీలో ఉద్యోగ రీత్యా ఉంటున్నారు. ఇద్దరి మధ్య మనస్పర్థల వల్ల స్వాతి తన భర్తపై గతేడాది మార్చి 11న ఖమ్మంలోని మహిళా పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ సమయంలో హరికృష్ణ జర్మనీలో ఉన్నాడు. అనంతరం స్వాతి కూడా జర్మనీకి వెళ్లింది. ఈ క్రమంలో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా వీరిద్దరూ జర్మనీ నుంచి వచ్చి లోక్‌అదాలత్‌కు హాజరయ్యారు. తామిద్దరూ కలిసిపోవాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. వారికి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ ఉత్తర్వులు అందజేశారు.

క్రైం సమాచారం

ఉరివేసుకుని యువకుడి బలన్మరణం



జూలూరుపాడు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): తండ్రి మద్యానికి బానిసై తన ఆలనపాలనను పట్టించుకోకపోవటంతో మనోవేదనకు గురై మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఈసం గోవర్ధన్(18) ఉరివేసుకుని బలన్మరణానికి పాల్పడ్డాడు. రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఈసం రాము - వెంకటలక్ష్మి దంపతులకు గోవర్ధన్, విష్ణువర్ధన్ ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా పెద్ద కుమారుడు గోవర్ధన్ డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి ఈసం రాము గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. తమ బాగోగులు, చదువు గురించి తండ్రి పట్టించుకోవటం లేదన్న కోపంతో గత కొంత కాలంగా గోవర్ధన్ మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలోని అమ్మమ్మ వాళ్ల ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. ఈ క్రమంలోనే తన గురించి ఎవరు పట్టించుకోవటంలేదని జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి పడమటనర్సాపుంలోని అమ్మమ్మ వాళ్ల ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి...

బూర్గంపాడు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): అప్పులు బాధ తాళలేక మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం రాత్రి సమయంలో మోతెలో చోటుచేసుకుంది. దుమ్ముగూడెం మండలం ఎంకాశినగర్ గ్రామానికి చెందిన అరవింద్ కుమార్(25) అనే వ్యక్తి గత రెండు సంవత్సరాలుగా బూర్గంపాడు మండల పరిధిలోని మోతెపట్టీనగర్‌లో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఐటీసీ కర్మాగారంలో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల అప్పులు కావడంతో మనస్తాపం చెందాడు. శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబసభ్యులు భద్రాచలం తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ నారయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



ఖమ్మం రూరల్, డిసెంబర్ 14(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటనపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. బోనకల్లు మండలం, చిరునోముల గ్రామానికి చెందిన జక్కి రాకేష్(26) 20 రోజుల క్రితం రోడ్డు డివైడర్ పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం హైవే రోడ్డులోగల కందుకూరు దగ్గర పనినిమిత్తం వెళ్లి చిక్కలపల్లి వద్ద ఉంటున్నాడు. ఈనెల 13వ తేదీ సాయంత్రం పనిముగించుకుని తన ద్విచక్రవాహనంపై పనివద్ద నుంచి తాము నివాసం ఉంటున్న చిక్కల్లపల్లికి వెళ్తున్న క్రమంలో మార్గంమధ్యలో చాతిలో నొప్పి రావడంతో వాహనాన్ని పక్కకు ఆపి రోడ్డుపై పడుకున్నాడు. వెంటనే తోటి పనివారు చికిత్స నిమిత్తం దగ్గరలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృదేహన్ని అంబులెన్స్‌లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. రాకేష్ మరణంపై తమకు అనుమానాలు ఉన్నాయని రాకేష్ బంధువులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. తరువాత పోలీసులు కలుగజేసుకోవడంతో ఆందోళన విరమించారు. తమ కుమారుడి మరణంపై పలు అనుమానాలు ఉన్నాయని, మృతదేహంపై గాయాలు ఉన్నాయని తండ్రి గోపయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఖమ్మం రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటనపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. మహబూబాబాద్ జిల్లా కేంద్రం రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గుల్లగట్టు హరిబాబు(46) కి భార్య స్వరూప, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెయింటింగ్ పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం అదే కాలనీకి చెందిన మరో మహిళతో కలిసి హుజూర్‌నగర్ వెళ్లి అక్కడే ఆమెతో కలిసి సహజీవనం చేస్తున్నాడు. ఈనెల 11వ తేదీన ఫంక్షన్ కోసం స్వరూప అత్తగారింటికి జామండ్లపల్లికి హరిబాబు తన స్నేహితులతో కలిసి వచ్చాడు. అదే రోజు రాత్రి దాసు, సైదులు, సతీష్ (ఆటోడ్రైవర్)తో కలిసి ఆటోలో హుజూర్‌నగర్ వెళుతుండగా మార్గమధ్యలో మండల పరిధిలోని వెంకటగిరి క్రాస్‌రోడ్డులో ఆటో బోల్తాపడింది. దీంతో హరిబాబుకి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించగాచ చికిత్స పొందుతూ ఈనెల 13వ తేదీన మృతిచెందాడు. దాసు, సైదులు, సతీష్‌తో పాటు మరో ఇద్దరిపై రోడ్డు ప్రమాద సంఘటనపై తమకు పలు అనుమానాలు ఉన్నాయని మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్టు

సత్తుపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేయగా మరో ఇద్దరు పరారయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఆరుమళ్ల తరుణ్‌కుమార్‌కు వేంసూరు మండలం లింగపాలెంలో రెండు నెలల క్రితం గంజాయి పీల్చే ప్రదేశంలో సత్తుపల్లి మండలం రేజర్లకు చెందిన జుంజునూరు సింహాద్రి (సందీప్) పరిచయం అయ్యాడు. తనకు గంజాయి కావాలని అరుణ్‌కుమార్ అడగగా శుక్రవారం సత్తుపల్లిలోని మెట్టాంజనేయ స్వామి గుడి సమీపంలోని ఓ మామిడి తోటలోకి రావాలని సింహాద్రి చెప్పాడు. అదే సమయంలో సిద్దారం గ్రామానికి చెందిన జంగం అఖిల్, రేజర్లకు చెందిన కలపాల రాంబాబు, ఎన్టీఆర్ నగర్‌కు చెందిన షేక్ ఇబ్రహీం (బాబూజాన్), లింగపాలెం గ్రామానికి చెందిన శ్రీనాథ్‌లు కూడా వారి నుంచి ఒక్కొక్క ప్యాకెట్ రూ.500చొప్పున కొనుగోలు చేశారు. ఈ ప్యాకెట్లను వాడుకోవడంతో పాటు కొంత విక్రయించే ఉద్దేశ్యంతో తీసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మామిడి తోటలో దాడిచేయగా ఆరుమళ్ల తరుణ్‌కుమార్, జంగం అఖిల్, కలపాల రాంబాబు, షేక్ ఇబ్రహీం పోలీసులకు పట్టుబడ్డారు. మిగిలిన ఇరువురు పరారయ్యారు. పోలీసులకు పట్టుబడిన వారి నుంచి రూ.2,782ల విలువైన 111.29గ్రాముల గంజాయిని, రెండు మోటారు సైకిళ్లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

రూ.2.60లక్షల కలప పట్టివేత



పట్టుబడిన కలప

దుమ్ముగూడెం, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం అటవీరేంజి పరిధిలోని చింతగుప్ప వద్ద శుక్రవారం అర్ధరాత్రి రూ2.60 లక్షల విలువ గల పదకొండు టేకు దిమ్మెలను రేంజి అధికారి కమల తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. సరిహద్దుల ఉన్న ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతం నుంచి వాహనంలో టేకు దిమ్మెలను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం అటవీశాఖ అధికారులకు అందింది. నిఘా విసి దిమ్మెలను, వాహనాన్ని పట్టుకుని భద్రాచలం కలప డిపోకు తరలించారు. అక్రమరవాణాకు పాల్పడిన ఒక వ్యక్తి దొరికాడు. దాడుల్లో ఎఫ్ఆర్వో శోభన్‌నాయక్, ఎఫ్ఎస్వో నందా తదితరులున్నారు.

ఆందోళనతో యువకుడి ఆత్మహత్య

రఘునాథపాలెం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మానసిక ఆందోళనతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. చిమ్మపూడికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జోనబోయిన పాపయ్య కుమారుడు వెంకటేష్(21) ఇటీవల వెంకటేష్ మానసికంగా ఆందోళనగా ఉంటున్నాడు. శనివారం పురుగులుమందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా వెంకటేష్ మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

కొండరెడ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- కొండరెడ్లతో ముఖాముఖి
- మారుమూల అటవీ గ్రామంలో 'ప్రజాపాలన'



కొండరెడ్ల కుటుంబాలతో మంత్రి తుమ్మల

దమ్మపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొండరెడ్ల అభివృద్ధికి ప్రత్యేక అధికారిని నియమించి బోర్లు వేయించి నీటి సౌకర్యం కల్పించి పామాయిల్, అంతర్ పంటలు సాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని పూసుగుంట గ్రామాన్ని శనివారం ఉదయం అధికారులతో కలిసి మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కొండరెడ్లతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధిపై సమీక్షించారు. మంత్రి వెంట అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ జితేష్ వీ పాటిల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, డీఆర్‌డీవో పీడీ విద్యాచందన, సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజ్, డీఎఫ్‌వో కృష్ణగౌడ్, ఆర్డీవో మధు తదితరులు ఉన్నారు.

గతంలో ఎమ్మెల్యేగా, 2015లో మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు రహదారి సౌకర్యం లేని పూసుకుంటను సందర్శించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అప్పట్లోనే రహదారి నిర్మాణానికి రూ.30కోట్లు కేటాయించగా, 10ఏళ్లుగా అటవీశాఖ అధికారుల అడ్డంకులతో అసంపూర్తిగా నిలిచాయి. దీంతో నేటికీ పూసుకుంట గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం లేదు. మరోసారి రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తుమ్మల శనివారం పూసుగుంట గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామపెద్ద యాట్ల నాగమ్మ మాట్లాడుతూ... మీరు మంజూరు చేసిన రోడ్డు ఇప్పటికీ పూర్తికాలేదని, గతంలో ఇచ్చిన కాలనీ ఇళ్లు కూలిపోయే దశలో ఉన్నాయని, తమ భూములకు నీటి సౌకర్యం కల్పించేందుకు వ్యవసాయబోర్లు వేయించాలని మంత్రి తుమ్మలను వేడుకున్నారు. దీనిపై స్పందించిన తుమ్మల రెవెన్యూ, అటవీ, నీటిపారుదల, విద్యుత్, తదితర శాఖల అధికారులకు అభివృద్ధి పనులపై, సమస్యల పరిష్కారంపై పలు సూచనలు ఇచ్చారు.

రాసన్నగూడెం, కట్కూరు మీదుగా వచ్చేందుకు పూసుగుంట గ్రామానికి రహదారి నిర్మాణం చేపట్టేందుకు అటవీ అడ్డంకులను తొలగించేలా చర్యలు తీసుకోవాలని డీఎఫ్‌వోని ఆదేశించారు. రెండు నెలల్లో రహదారి సౌకర్యం కల్పించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. పూసుగుంటలో జరిగే అభివృద్ధి పనులపై మండలస్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీ వేసి అభివృద్ధి పనులను పూర్తిచేసేవిధంగా కలెక్టర్ పర్యవేక్షించాలన్నారు. అడవులను నరికి పోడు చేయవద్దని గొత్తికోయలకు, కొండరెడ్లకు తుమ్మల సూచించారు. రెండు నెలల తర్వాత పూసుగుంటను సందర్శిస్తానని, అప్పటికి అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు.

మంచు దుప్పటిలో..

పూసుగుంట.. కొండరెడ్ల గిరిజన గ్రామం. దమ్మపేట మండల కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలో చుట్టూ అడవులతో కనీస సౌకర్యాలకు, బాహ్యప్రపంచానికి దూరంగా కొలువుదీరి ఉంటుంది. శనివారం ఉదయం మంచు దుప్పటి వీడక ముందే 7గంటలకు మంత్రి తుమ్మల అధికారులతో కలిసి గ్రామానికి చేరుకుని కొండరెడ్ల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

- వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల
- సత్తుపల్లిలో టీఎస్‌యూటీఎఫ్ 6వ జిల్లా మహాసభలు ప్రారంభం



మాట్లాడుతున్న రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లిలోని బాలికోన్నత ప్రభుత్వ పాఠశాల (మహబూబ్ అలీ ప్రాంగణం) లో శనివారం నిర్వహించిన టీఎస్ యూటీఎఫ్ ఖమ్మంజిల్లా 6వ మహాసభలలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రత్యేకించి ప్రభుత్వ విద్యను, వైద్యానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. 11వేల మందికి డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు ఇచ్చామని, 30వేలమందికి ప్రమోషన్లు, బదిలీలు కల్పించామని చెప్పారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా మార్చి వరకు ఆగాలని, ఆ తర్వాత అన్నింటినీ పరిష్కరిస్తామని తెలిపారు.

1968నాటి మొదటి విద్యావిధానం దేశాభివృద్ధికి దోహదపడేదిగా, జాతీయ సమైక్యతను పెంపొందించే విధంగా, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటేలా ఉండేదని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ప్రీ ప్రైమరీని ప్రైమరీ స్కూళ్లలోనే ఉంచాలని, అంగన్‌వాడీలో ప్రీ ప్రైమరీ సరైనది కాదని, ప్రభుత్వ స్కూళ్లను పట్టించుకుంటేనే నాణ్యమైన విద్య అన్నివర్గాల వారికి అందుతుందని చెప్పారు.

సభా ప్రారంభానికి ముందు జవహర్ నగర్‌లో నండూరి సీతారామమ్మ జ్ఞాపకార్థం నూతనంగా నిర్మించిన టీఎస్‌యూటీఎఫ్ సత్తుపల్లి ప్రాంతీయ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించిన అనంతరం ర్యాలీగా ఉపాధ్యాయులు మహాసభల ప్రాంగణానికి చేరుకున్నారు. కాగా ఆదివారం మహాసభల సందర్భంగా ప్రతినిధుల సభతో పాటు జిల్లా కార్యదర్శివర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, హెచ్‌ఎం నీరుడు నాగేశ్వరరావు, రాష్ట్ర, జిల్లా బాధ్యులు చావా రవి, దుర్గాభవానీ, బీ.రాజు, జీవీ.నాగమల్లేశ్వరరావు, పొరుపల్లి నాగేశ్వరరావు, ఈవీ.రామారావు, నిర్మలకుమారి, జీఎస్ఆర్.రమేష్, బుర్రి వెంకన్న, ఎస్‌కే.యూసఫ్, రంజాన్, వీ.రాంబాబు, లక్ష్మణరావు, సురేష్, చెరుకు శ్రీనివాసరావు, కొక్కెరగడ్డ వెంకటేశ్వరరావు, బాలయ్య, బాల నాగేశ్వరరావు, దొడ్డా ఉమామహేశ్వరరెడ్డి, రావిళ్ల రమేష్, మధు, అశోక్, ఐ.నాగేశ్వరరావు, జల్లిపల్లి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.



బాలికలతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కామన్ డైట్ చార్జీలతో విద్యాభివృద్ధికి మరింత తోడ్పాటు

- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కొణిజర్ల, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కామన్ డైట్ చార్జీల వలన పిల్లల అభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందని, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ఉన్న సదుపాయాలను వినియోగిస్తామని, దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని గొప్పస్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆకాంక్షించారు. శనివారం కలెక్టర్ మండలంలోని తనికెళ్ల సమీపంలో గల గిరిజన గురుకుల బాలికల డిగ్రీ కళాశాలను సందర్శించారు. ప్రభుత్వం పెంచిన కొత్త డైట్ మెనూను ప్రారంభించారు. వసతిగృహంలో వసతులను పరిశీలించారు. కావలసిన వసతులపై ఆరాతీశారు. స్వయంగా కలెక్టర్ విద్యార్థునులకు భోజనం వడ్డించి, వారితో పాటు కలిసి భోజనం చేశారు. భోజనసామగ్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతిగృహాలకు పెంచిన కామన్ డైట్‌చార్జీ వలన విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని, ఇలా ఏర్పాటు చేయటం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. లక్ష్యం సాధించాలంటే ప్రణాళిక అవసరం అని అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చుని తెలిపారు. స్నేహితుల్లో ఎవరైనా ఇబ్బందిక పరిస్థితుల్లో ఉంటే వారికి సహాయం చేయాలని తెలిపారు. బాలికలతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి, వైస్‌ప్రిన్సిపాల్ నవ్య పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యలో పరిశోధనలు జరగాలి

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, అధికారులు

అశ్వారావుపేట రూరల్/టౌన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ఏర్పాటు తన కలల పంట అని, వ్యవసాయ విద్యలో పరిశోధనలు జరగాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవాల సందర్భంగా శనివారం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా కళాశాల ఏర్పాటుకు పునాదిరాయి వేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన వజ్రోత్సవ వేడుకలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యున్నత స్థాయిలో కళాశాల ఉండాలని, రైతుల కోసం నిత్యం ప్రయోగాలు చేయాలని తెలిపారు. శాస్త్రవేత్తల విజ్ఞానం అంతా రైతులకు ఉపయోగపడి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ఉండాలన్నారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల రాష్ట్రంలోని అన్ని కళాశాలల కంటే ముందు వరుసలో ఉండాలని తెలిపారు. ఈసందర్భంగా రైతుసంఘం నాయకులు బండి బాస్కర్ ఎండ్లబండిని తుమ్మలకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి రాజిరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ గోపి ఐటీడీఏ పీవో రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యం సమాజానికి దిక్సూచి

- ఈస్థటిక్స్ స్పేస్ సాహిత్య సంస్థ బాధ్యుడు రవిమారుత్
- ఘనంగా ప్రారంభమైన కథాంతరంగం
- రెండు రాష్ట్రాల నుంచి కథా రచయితల హాజరు



నల్లబంగారం కథ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మం సాంస్కృతికం డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సాహిత్యం సమాజానికి దిక్సూచీ అని ఈస్థటిక్స్ స్పేస్ సాహిత్య సంస్థ బాధ్యుడు, కవి విద్యావేత్త రవి మారుత్ అన్నారు. కవిత్వం, కథ, ప్రక్రియ ఏదైనా దాని పరమార్థం సమాజ శ్రేయస్సే అన్నారు. కథలు, సమాజంతోపాటు వ్యక్తులను సరైన దిశగా నడిపిస్తాయని అన్నారు. తెలుగు భాష అంతరించి పోతోందన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్న తరుణంలో కథ భాషాభివృద్ధికి సైతం పాటు పడుతోందన్నారు. కథకు జవజీవం కలిగించే ప్రయత్నం చేయాలని ప్రముఖ కథా రచయిత ఖదీర్ బాబు, రమణ మూర్తి, నవీన్ తదితరులు ఇటీవల చేసిన సూచన మేరకు ఖమ్మంలో మొదటి సారిగా కథాంతరంగం పేరుతో ప్రత్యేక చర్చా కార్యక్రమం చేపట్టామన్నారు.

కథ మళ్లీ బతుకుతోంది..

కథా సాహిత్యాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా అన్నారు. ఈస్థటిక్స్ స్పేస్ ఆధ్వర్యంలో శనివారం కొత్త కలెక్టరేట్ ఎదురుగా గల సెడార్‌వ్యాలీ స్కూల్‌లో మొదలైన కథాంతరంగం సాహిత్య కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఓల్గా మాట్లాడుతూ కవిత్వంతో పోలిస్తే కథకు ఆదరణ తగ్గిందని, కథ పని అయిపోయిందని సాహిత్య కారులు అభిప్రాయపడుతున్న దశలో యువ కథకుల కథా ప్రతిభ చూస్తుంటే కథకు పూర్వ యుగం ప్రారంభం అయినట్లు అనిపిస్తోందన్నారు. సండే మ్యాగజైన్లు, కథల పోటీలు, కథా సంపుటాలు , సంకలనాల్లో కొత్త కథకుల ప్రతిభ తెలుస్తోందన్నారు. కవిత్వ గుమ్మంగా ఉన్న ఖమ్మం నుంచి కథా పరిపుష్టం చేసే క్రతువును ఈస్థటిక్స్ స్పేస్ సాహిత్య సంస్థ భుజాన వేసుకోవటం అభినందనీయం అన్నారు. కథలను చదివి వదిలేయకుండా వాటిపై విస్తృత చర్చలు, విమర్శలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆటువంటి మంచి పని ఇతర సాహిత్య సంస్థలకు ఆదర్శం కావాలన్నారు..

అంతరించి పోయే దశకు చేరిన కథ ఖమ్మం వేదికగా తిరిగి ప్రాణం పోసుకుంటుండటం సంతోషకరమని ప్రముఖ సాహితీవేత్త ఎల్ఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. ఖమ్మం ఈస్థటిక్స్ ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా కథా బలోపేత కృషి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో కాళోజీ అవార్డు గ్రహీత డాక్టర్ సీతారం, కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్, ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు, ప్రముఖ కథా రచయిత, విమర్శకుడు వంశీ కృష్ణ, జామవా సాహిత్య సంస్థ బాధ్యుడు డాక్టర్ పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ప్రముఖ సాహితీవేత్త ముక్కామల చక్రధర్, తదితరులు కథాంతరంగం కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కథకులు చర్చించిన కథాంశాలను సమన్వయం చేస్తూ విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో ఉభయ రాష్ట్రాలకు చెందిన కథా రచయితలు, రచయిత్రులు పాల్గొని ఒక్కో కథపై తమ కోణంలో చర్చించారు. శ్రీఊహ, ఝాన్సీ పాపుదేశి, తాళ్లపల్లి యాకమ్మ, ఉరిమళ్ల సునంద, కుంజా కళ్యాణి, ఫణిమాధవి, మానస ఎండ్లూరి, ఇండ్ల చంద్రశేఖర్, బండారు రవికుమార్, వేణు మరీదు, మస్ శ్రీతమ్, మువ్వా జయశ్రీ, తోట సుభాషిణి, కోసూరి జయసుధ, స్వప్నపేరి , బసవేశ్వర్ పెనుగొండ తదితరులు పాల్గొన్నారు. అయిదుగురేసి కథా రచయతలను ఒక్కో బృందంగా ఏర్పాటు చేసి చర్చలు నిర్వహించారు.



ప్రసంగిస్తున్న రవి మారుత్

తల్లిదండ్రులకు చిన్నారి అప్పగింత

- గిరిజన దంపతులకు, దత్తత తీసుకున్న వారికి కౌన్సిలింగ్
- చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరు కావాలని ఆదేశం

జూలూరుపాడు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): దత్తత పేరుతో విక్రయించిన 3 నెలల చిన్నారి(శిశువును) శనివారం పోలీసుల సమక్షంలో చైల్డ్ వెల్ఫేర్ ప్రొటక్షన్ అధికారి శేషు తల్లిదండ్రులకు అప్పగించారు. శిశువు విక్రయంపై జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో కొమ్ముగూడెం గ్రామానికి చెందిన చిన్నారి తల్లిదండ్రులు, దత్తత తీసుకున్న లక్ష్మీదేవిపల్లికి చెందిన దంపతులు జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఇరువురిని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ ప్రొటక్షన్ అధికారి విచారించారు. శిశువును వారికి ఎందుకు అక్రమంగా దత్తత ఇచ్చారని చిన్నారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. తమకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారని, మూడోవ సంతానంగా అక్టోబరు 4న ఆడపిల్ల పుట్టిందన్నారు. ఇద్దరు సంతానం ఉండటంతో మూడో సంతానంగా పుట్టిన కుమార్తె పోషణ భారంగా మారుతుందని భావించి తమకు తెలిసిన వారు కావడంతో లక్ష్మీదేవిపల్లికి చెందిన దంపతులకు తమ కూతురిని పెంచుకోవడానికి ఇచ్చినట్లు తల్లిదండ్రులు వారికి తెలిపారు. తమ కూతురిని తమకు ఇవ్వాలని, తామే పెంచుకుంటామని చిన్నారి తల్లిదండ్రులు అధికారులను కోరారు.

ఈ క్రమంలో చైల్డ్ వెల్ఫేర్ ప్రొటక్షన్ అధికారి చిన్నారిని భద్రాచలంలోని శిశు గృహానికి అప్పగిస్తామని వారికి తెలిపారు. దీంతో తమ కూతురు అనారోగ్యంతో ఇబ్బంది పడుతుందని తమకే అప్పగించాలని వారు కోరారు. చైల్డ్ వెల్ఫేర్ ప్రొటక్షన్ ఉన్నతాధికారి దృష్టికి చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషయాన్ని తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం విచారణకు రావాలని ఇరువురికి ఆదేశించారు. వారు అందుకు అంగీకరించారు. కొత్తగూడెం చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ ముందు విచారణకు హాజరవుతామని ఇరువురు లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. దీంతో చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించినట్టు ఆయన తెలిపారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	24 రూ.
వంకాయ	28
గుత్తి వంకాయ	38
బీరకాయ	48
పచ్చిమిర్చి	34
కాకరకాయ	38
బెండకాయ	38
పొట్లకాయ	38
దోసకాయ	18-34
చిక్కుడు	44
నాటుచిక్కుడు	88
గోరుచిక్కుడు	34
క్యాబేజీ	28
దొండ	44-50
సొరకాయ	20
క్యారెట్	64
క్యాప్సికం	74
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	195
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	పుష్ప 2
శ్రీనివాస:	పని
సాయిరాం:	మిస్‌యూ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	పుష్ప 2

హలో ఆర్టీసీ

ఖమ్మం కొత్త బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225979
కార్గోసేవల నెంబరు:	9154298589

ఖమ్మం పాతబస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225965
కార్గోసేవల నెంబరు:	9704345599

సత్తుపల్లి బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225962
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225990
కార్గోసేవల నెంబరు:	9154298595

మధిర బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225961
బస్టాండ్ ఎంక్వయిరీ:	7382925289
కార్గోసేవల నెంబరు:	8143765370



వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

పెరికశింగారంలో వేడుకకు హాజరైన మంత్రి పొంగులేటి, కందాళ

కూసుమంచి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరికశింగారం గ్రామంలో బొడ్రాయి, దేవతావిగ్రహాల ప్రతిష్ఠలు వైభవంగా జరిగాయి. గ్రామంలో బొడ్రాయి, ముత్యాలమ్మ, మారెమ్మ, గంగమ్మ, విగ్రహాలను ప్రతిష్ఠించారు. ముఖ్యఅతిథిగా రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. పాలేరు మాజీఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకకు బంధువులు, కుటుంబసభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ జూకూరి గోపాలరావు, మాజీ సర్పంచులు వాసంశెట్టి వెంకన్న, వేముల వీరయ్య, జానయ్యసారు తదితరులు పాల్గొన్నారు.







పూజలు నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందాళ దంపతులు,పెరికి సింగారంలో ఆలయం

తాగునీటి పైపులైన్లపై అజాగ్రత్త

- అభివృద్ధి పనుల నేపథ్యంలో ఇష్టారాజ్యంగా గోతులు
- పైప్‌లైన్లు ధ్వంసమై నీటి సరఫరాకు అంతరాయం

ఖమ్మంటౌన్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): నగరంలో చేపడుతున్న పలుఅభివృద్ధి పనుల్లో కనీస జాగ్రత్తలు పాటించకపోవటంతో తాగునీటి పైప్‌లైన్లు ధ్వంసమవుతున్నాయి. ఫలితంగా పలు ప్రాంతాల్లో తాగునీరు సరఫరా నిలిచి, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో అభివృద్ధిపనుల్లో భాగంగా రహదారుల నిర్మాణంతో పాటు డ్రెయినేజీల నిర్మాణం చేపడుతున్నారు. డ్రెయినేజీ కాలువల నిర్మాణం సందర్భంగా రహదారి పొడవునా గోతులు తీస్తున్నారు. అదే సమయంలో నివాసాలకు ఇచ్చిన పంపు కనెక్షన్‌లకు సంబంధించిన పైప్‌లైన్ల విషయం పట్టించుకోవటం లేదు. ఫలితంగా పలుచోట్ల తాగునీటి పైప్‌లైన్లు ధ్వంసం అవుతున్నాయి. పైపులైన్లు ధ్వంసం అయిన ప్రాంతంలో నీళ్ల పెద్దఎత్తున లీకై పనులు చేసే ప్రాంతం బురదమయం అవుతున్నది. తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇటీవల నగరంలోని మామిళ్ల గూడెం ప్రాంతంలో డ్రెయినేజీ నిర్మాణాల సందర్భంగా పనులు జరుగుతున్నప్పుడు తాగునీటి పైపులైన్లు ధ్వంసం అయ్యాయి. దీంతో పరిసర ప్రాంతాల్లో తాగునీరు సరఫరా నిలిచిపోయింది. తరువాత కొత్త పైపలైన్లు ఏర్పాటు చేశారు. తాజాగా వైఎస్సార్ నగర్‌లో రహదారి నిర్మాణం నిమిత్తం ప్రస్తుతం ఉన్న మట్టిరోడ్డును తవ్వటంతో పైప్‌లైన్లు ధ్వంసమై, నీటి సరఫరా నిలిచిపోయింది. పైపుల నుంచి లీకైన నీరు పెద్దఎత్తున నిలవటంతో చెరువును తలపించింది. కాగా అభివృద్ధిపనులు చేపట్టే సమయంలో తాగునీటి పైపులైన్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు హెచ్చరించినా, కాంట్రాక్టర్లు పట్టించుకోవటం లేదు. సూపర్‌వైజర్లను పనుల దగ్గర ఉంచటంతో వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా పనులు జరిగేటప్పుడు తాగునీటి పైప్‌లైన్లు ధ్వంసం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



వైఎస్సార్‌నగర్‌లో పైప్‌లైన్ ధ్వంసం కావటంతో నీళ్లు పట్టుకునేందుకు చేసుకున్న ఏర్పాటు

నగర టాక్స్ ప్రాక్టీషనర్‌కు జాతీయ అవార్డు

ఖమ్మంస్పోర్ట్స్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన టాక్స్ ప్రాక్టీషనర్ ఉల్లిబోయిన సైదులు జాతీయస్థాయిలో అవార్డును సొంతం చేసుకున్నాడు. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ 'చురుకైన ప్రాక్టీషనర్, సభ్యుల అభివృద్ధి అనే అంశాల ఆధారంగా దీన్ని అందజేశారు. శనివారం గుజరాత్‌లోని జునాఘడ్‌లో జరిగిన జాతీయ సమావేశంలో ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు నారాయణప్రసాద్‌జైన్,సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్‌ల చేతుల మీదుగా అందుకున్నారు. సైదులును సౌత్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ సంఘం అధ్యక్షుడు రామరాజు శ్రీనివాసరావు, జిల్లా టాక్స్ ప్రొఫెషనల్స్ బాధ్యులు అభినందించారు.



అవార్డును అందుకుంటున్న సైదులు

సీపీఎంకు పూర్వవైభవం తీసుకొస్తాం

- పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి రమేష్

కూసుమంచి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పాలేరు డివిజన్‌లో సీపీఎంకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేయనున్నట్లు ఆ పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, మండల కార్యదర్శి తోటకూరి రాజు తెలిపారు. శనివారం కూసుమంచిలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో 270 గ్రామాలున్నాయని, అన్నిగ్రామాల్లో పార్టీ పటిష్ఠతకు కృషిచేయనున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రజాఉద్యమాలను నిర్మిస్తామని తెలిపారు. దళిత, గిరిజన వాడల్లో పార్టీ నిర్మాణానికి, అభివృద్ధికి ప్రయత్నిస్తామన్నారు. మహాసభల్లో తీసుకున్న నిర్ణయాలను అమలు చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వాల ప్రజావ్యతిరేక కార్యక్రమాలపై నిరంతరం ఉద్యమిస్తామన్నారు.ఈ సమావేశంతో బషీరుద్దీన్, గుడవర్తినాగేశ్వరరావు, సుదర్శన్‌రెడ్డి కొమ్ముశ్రీను, యడవల్లి రమణారెడ్డి, పన్మతిరావు, గంగాధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్

'న్యూఇరా'లో హిందీ బోధనకు ప్రత్యేక శిక్షణ

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని న్యూఇరా పాఠశాలలో శనివారం హిందీ ఉపాధ్యాయులకు బోధన పద్ధతులపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ ఉపాధ్యా శిక్షకురాలు రామలక్ష్మీ దాస్ ఈ తరగతులు నిర్వహించారు. తెలుగు మాతృ భాష కలిగిఉన్న విద్యార్థులకు హిందీలో భాష మెళకువలను ఎలా వివరించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఐవి రమణారావు, డైరెక్టర్ డాక్టర్ పి భూమేశ్వరరావు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న రామలక్ష్మీ దాస్

తెలుగుజాతి గుండె చప్పుడు ఎన్టీఆర్

- టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం

ఖమ్మంకలెక్టరేట్,డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి గుండె చప్పుడు ఎన్టీఆర్ అని ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డాక్టర్ వాసిరెడ్డి రామనాధం, కేతినేని హరీష్ అన్నారు. తెలుగుదేశం జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం కేతినేని హరిష్ చంద్ర ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు సినీ వారసత్వానికి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రూపాయల కిలోబియ్యం పథకాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ప్రవేశపెట్టిన మొట్టమొదటి ఘనత ఎన్టీ రామారావుకి దక్కుతుందన్నారు. ఈ పథకాన్ని ఇప్పటికీ ఏ ప్రభుత్వం వచ్చినా కొనసాగింపు చేస్తున్నారని అన్నారు. ఎన్టీఆర్ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళుఅని పేద ప్రజలకు సేవ చేయడానికి నేను రాజకీయాలకు వచ్చానని అన్న ఎన్టీరామారావు మాటలను నేతలు గుర్తు చేశారు.తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులుఅర్పించారు. కేక్‌కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈసందర్భంగా సీనియర్ నాయకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పులిపాటి ప్రసాద్, మందడపు సుధాకర్, హనుమంతు రెడ్డి,కుతుంబక కృష్ణ ప్రసాద్, జహీరా బేగం, నాగండ్లలక్ష్మణ్, నారాయణ రావు, పృథ్వీ, జయ్ పాల్గొన్నారు.



రామనాథానికి కేక్ తినిపిస్తున్న బాలసాని

గాంధీచౌక్-కమాన్‌బజార్

అనుసంధానంగా మినీబ్రిడ్జి నిర్మించాలి

- సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ఖమ్మంటౌన్,డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీచౌక్-కమాన్‌బజార్‌లకు అనుసంధానంగా మినీబ్రిడ్జిని నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో గాంధీచౌక్ మధ్యగేటు వద్ద సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ మాట్లాడారు. గాంధీచౌక్‌లోని హర్కారబావి సెంటర్, ప్రకాష్‌నగర్, సుందరయ్యనగర్, పంపింగ్‌వెల్ రోడ్ తదితర ప్రాంతాల నుంచి కమాన్‌బజార్‌కు అనేక వేలమంది నిత్యం ప్రయాణం చేస్తుంటారని చెప్పారు. ఎప్పుడూ రైల్వేగేట్ మూసి ఉంచటంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కమాన్‌బజార్ నుంచి గాంధీచౌక్‌కు రావాలన్నా చర్చికాంపౌండ్ బ్రిడ్జి, పాత బస్టాండ్ వద్ద నుంచి తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గాంధీచౌక్-కమాన్‌బజార్‌లకు అనుసంధానంగా మినీబ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూక్యా వీరభద్రం, ఎస్‌కే. మీరా, షేక్ నాగుల్‌మీరా, బోడపట్ల సుదర్శన్, ఎస్.నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.




సంతకాల సేకరణ చేస్తున్న సీపీఎం నేతలు

26 నుంచి సీపీఐ వందేళ్ల ఉత్సవాలు

జిల్లా కార్యదర్శి దండి సురేష్

ఖమ్మంటౌన్,డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): ఈనెల 26 నుంచి ఏడాది పొడవునా సీపీఐ వందేళ్ల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. శనివారం జిల్లా కార్యక్రమంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ వేడుకల సందర్భంగా ఖమ్మంలో భారీ ప్రదర్శన, అన్ని గ్రామాల్లో పతాకావిష్కరణలుఉంటాయన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారన్నారు. బీజేపీ మతం పేరుతో ఘర్షణలు సృష్టిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం హామీలను అమలు చేయటంలేదన్నారు. ప్రజాసమస్యలపై దశలవారీ ఆందోళనను నిర్వహిస్తామన్నారు. వచ్చే స్థానికసంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నట్లు దండి సురేష్ తెలిపారు. విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కే. జానీమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, కర్ణకుమార్, జిల్లా కార్యవర్గసభ్యులు మహమ్మద్ సలాం పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా వెంకన్న



నేలకొండపల్లి, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా మాదాసు వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో శనివారం జరిగిన మండల ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో పొట్టపింజర బాలస్వామి, ఏపూరి వెంకటేశ్వరరావు, తోళ్ళ సురేష్, కూరపాటి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

నేలకొండపల్లి, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని అతి పురాతనమైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి 14 జనవరి, 2025మంగళవారం వరకు ధనుర్మాస ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు తూపురాణి మధుసూధనాచార్యులు, ఈఓ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచీ ప్రతీ రోజూ ఉదయం 5గంటలనుంచి 7గంటల వరకు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. జనవరి 10న శుక్రవారం వైకుంఠ ఏకాదశి(ముక్కోటి), 11కుడారై,13న గోదాదేవి కళ్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా శ్రీచైతన్య క్రీడా పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య విద్యాసంస్థల వార్షిక క్రీడా పోటీలు శనివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఘనంగా జరిగాయి. పోటీలను చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, టూటౌన్ సీఐ బాలకృష్ణ, ఎంఈవో శైలజాలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పోటీల్లో విద్యాసంస్థల చెందిన సుమారు 2100 మంది క్రీడాకారులు హాజరైనారు. కార్యక్రమంలో ఏజీఎంలు చేతన్‌మాధుర్, జయప్రకాశ్, ప్రిన్సిపాల్స్ టీఎల్ఎన్ శర్మ, నాగప్రవీణ, ఏడుకొండలు, ఇస్మాయిల్, నీరజ, మురళీమోహన్, రవికుమార్ పాల్గొన్నారు.



'సీఎంకప్'లో సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ



చార్విక్‌ను అభినందిస్తున్న పాఠశాల అధినేత నాగేంద్రకుమార్

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలో పట్టణస్థాయి సీఎంకప్ క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారని సర్వజ్ఞ పాఠశాల యజమాన్యం తెలిపింది. జస్మిత, నేహామాధురి, లాస్య, అశ్విక్, ప్రహర్ష్, శశాంక్, రాహుల్, అఖిల్, మహేందర్, శ్రీనాథ్, తనీష్, శ్యామ్, వర్షిత్, లుకేష్, శ్రీనివాస్, శ్రీకర్, శ్రీనాధ్, కేతన్, చరణ్ ఫుట్‌బాల్, షటిల్ విభాగాల్లో పతకాలు సాధించారని తెలిపారు. శనివారం పాఠశాలలో వారిని పాఠశాల డైరెక్టర్లు రాజావాసిరెడ్డి నాగేంద్రకుమార్, నీలిమ వారిని అభినందించారు.

నూతన మెనూతో మంచి ఆహారం



నూతన మెను చార్టు ప్రదర్శిస్తున్న సొసైటీ చైర్మన్ రఘురాం

రఘునాథపాలెం,డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం డైట్ చార్జీలను మంచి మెనూను ప్రవేశ పెట్టిందని రఘునాథపాలెం సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, తహసీల్దార్ లూధర్‌విల్సన్ పేర్కొన్నారు. శనివారం రఘునాథపాలెం గిరిజన ప్రతిభా కాలేజీలో వారు నూతన మెనూను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రిన్సిపాల్ బాలస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, వైస్ ప్రిన్స్‌పాల్, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల

చెంతకు ఇద్దరు

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్ చైర్మన్‌న అన్నం శ్రీనివాసరావు ఇద్దరిని శనివారం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మతిస్థిమితం కోల్పోయి గతనెల నగరంలోని టేకులపల్లి రామాలయం వద్ద గుర్తుతెలియని వృద్ధుడు తిరుగుతుండగా స్థానికులు డయల్ 100 ద్వారా పోలీసుకు సమాచారం అందించారు. అర్బన్ పోలీసులు ఆవ్యక్తిని అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. వైద్య సేవలు అనంతరం కోలుకున్న అతను బిహార్‌గా వివరాలు వెల్లడించాడు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు శనివారం ఖమ్మం రాగా అప్పగించారు. మరోవ్యక్తి తురక రమణ అనే మహిళ మతిస్థిమితం కోల్పోయి ఖమ్మంలో తిరుగుతుండగా అన్నం ఫౌండేషన్ చేరదీసి వైద్య సేవలు అందించింది. కోలుకోని వివరాలు తెలిపింది. తల్లితండ్రులు తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం అని తెలుపగా సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు శనివారం అప్పగించారు.

బాలికల వసతి గృహంలో కామన్ డైట్ చార్ట్ ఆవిష్కరణ

కూసుమంచి, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): కామన్ డైట్‌మెనూను శనివారం లోని సాంఘీక సంక్షేమ వసతిగృహంలో ప్రారంభించారు. ఏఈ శేఖర్‌బాబు కొత్త కామన్ డైట్ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేస్తూ, లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు.

వైద్యరంగాన్ని బలోపేతం చేయాలి

మంత్రి పొంగులేటికి పీవైఎల్ నాయకుల వినతి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న పీవైఎల్ రాష్ట్ర నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేయటం ద్వారానే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని ప్రగతిశీల మహిళా సంఘం(పీవైఎల్) రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ శిరోమణి, పూర్వకార్యదర్శి చంద్ర అరుణ తదితరులు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి విన్నవించారు. సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, మధిర, ఇల్లెందు, వైరా, తిరుమలాయపాలేం, నేలకొండపల్లి ప్రభుత్వ హాస్పటల్స్‌లో సమస్యల నివేదికను మంత్రికి అందించారు. న్యూరో, డెంటల్, ఆర్థో, రేడియాలజీ వంటి సేవలు ప్రభుత్వ హాస్పటల్స్‌లో అందుబాటులో ఉంచాలని కోరారు.మాతాశిశు హాస్పటల్స్‌లో గైనకాలజీ వైద్యులు కొరత ఉందని, తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా పీవైఎల్ కమిటీ నాయకులు కెచ్చల కల్పన, టీ.ఝాన్సీ, ఆవుల మంగతాయి, ప్రతాపనేని శోభ పాల్గొన్నారు.

హేమలతకు మంత్రి నివాళి

తిరుమలాయపాలెం: మండలంలోని మహ్మదాపురం మాజీ ఎంపీటీసీ ఇర్రి హేమలతకు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఘననివాళులర్పించారు. శుక్రవారం గుండెపోటుతో మృతిచెందటం తెలిసిందే..శనివారం భౌతికకాయానికి మంత్రి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, ఓర వెంకటేశ్వర్లు, సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.

17న సెమీ క్రిస్మస్ వేడుకలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దయానంద్

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సెమీ క్రిస్మస్ వేడుకల పోస్టర్లను కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ శనివారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 17వ తేదీన స్థానిక జేవీఆర్ కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌సీ పొలిటికల్ వింగ్ జాతీయ అధ్యక్షుడు అలవాల కరుణాకర్, బేతంపూడి వరప్రసాద్, శాంసన్, పీ.రవికిరణ్‌పాల్, జాన్ మార్క్, ఏసుపాదం, మాథ్యూస్ పాల్గొన్నారు.

సీపీఐ సభ్యత్వ నమోదు

చింతకాని, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో సీపీఐ రైతుసంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందని పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో వేమూరి రవింద్రబాబు, కూచిపుడి రవి, మార్గం శ్రీను, పదిమల వెంకటనర్సయ్య, ఆవుల మంగయ్య తదితరలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

» డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీస్టాల్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

బోనకల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మండలంలో శనివారం పలు గ్రామాల్లో రూ. 20.94 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ముష్టికుంట్ల గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద రూ. 60లక్షలతో వేయనున్న సీసీ రోడ్లకు, బోనకల్‌లో రూ. 19.45లక్షల పనులకు, రావినూతలలో రూ. 20 లక్షలు, గార్లపాడు నుంచి రామాపురం మీదుగా పాతర్లపాడు, గోవిందాపురం(ఎల్), బీబీసీ వరకు రూ. 6.70 కోట్ల నిధులతో వేయనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గోవిందాపురం(ఎల్) నుంచి పాతర్లపాడు, బీబీసీ వరకు రూ. 4.60 కోట్లతో వేయనున్న బీటీ రోడ్డుకు, గోవిందాపురం(ఎల్) నుంచి ఇంటర్నేషల్ స్కూల్, తూటికుంట్ల రోడ్డు వరకు రూ. 2.60 కోట్లతో బీటీ రోడ్డు పనులకు, గోవిందాపురం నుంచి పాతర్లపాడు మీదుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ వరకు రూ. 2.30 కోట్లతో వేయనున్న బీటీ రోడ్డుకు, ఇదే గ్రామం నుంచి వల్లాపురం వరకు రూ. 3.40 కోట్ల నిధులతో వేయనున్న బీటీ రోడ్డుకు, జానకీపురంలో రూ.15లక్షలతో సీసీ రోడ్డు పనులకు, రాపల్లిలో రూ.20 లక్షతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బోనకల్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీస్టాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, నాయకులు చేబ్రోలు వెంకటేశ్వర్లు, మోదుగు సుధీర్ బాబు, ఉమ్మినేని బాబు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, పల్లిపాటి తిరుపతిరావు, గూడ నర్సయ్య శాస్త్రీ, భద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మధిర రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం మధిర మండలం రొంపిమళ్ల గ్రామంలో రూ.20లక్షలతో చేపట్టిన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల్లో తాను ముందుంటానన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మాజీ ఏఎంసీ చైర్మన్ వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నాయకులు కర్నాటి రామారావు, దారా బాలరాజు, దుంపా వెంకటేశ్వర్‌రెడ్డి, గొల్లమందల శ్రీనివాసరావు, వనమా పిచ్చయ్య, శ్రీనిధి అనిల్‌కుమార్, కరివేద రాంబాబు, పులిగొండ్ల చిట్టిబాబు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు వీరయ్యకు నివాళి

చింతకాని, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెకంటేశ్వర్లు తండ్రి, స్వాతంత్ర్య సమరయోధుడు అంబటి వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మృతుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట జిల్లా, మండల కాం గ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

» ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

కారేపల్లి, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం కారేపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంజూరైన 108అంబులెన్స్‌ను ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టే కార్యక్రమాల్లో తాను ముందుంటానన్నారు. అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం పలువురికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

'మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి'

మధిరటౌన్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదిగితేనే ఆమెతో పాటు ఆ కుటుంబానికి గౌరవం అని అమ్మ ఫౌండేషన్ చైర్మన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని అన్నారు. శనివారం మధిరలోని శ్రీనిధి డిగ్రీ కళాశాల నందు మధిర మహిళా స్కిల్ శక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత బ్యూటీ శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి కళాశాల చైర్మన్ అనిల్ కుమార్ నెహ్రూ, కరస్పాండెంట్ కనక తార, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్, మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు నందిని

'జీపీ కార్మికుల సభను విజయవంతం చేయాలి'

కల్లూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17 న తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఊడల కృష్ణమూర్తి, యస్‌డీ వజీర్‌మియాలు అన్నారు. శనివారం కల్లూరులో జీపీ కార్మికులతో కలిసి వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీ కార్మికులు కనీస వేతనాల కోసం 35 రోజుల సమ్మె చేయగా నాడు ప్రతి పక్షంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు వాటి పరిష్కారానికి తగిన హామీ ఇచ్చారేకాని నేటి వరకు వాటిని అమలు పరచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతి నెల 1 వ తేదీ నాటికి వేతనాలు వేస్తామని చెప్పిన అది కూడా అమలు కాలేదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్కినేని ప్రవీణ్, వేము శ్రీనివాసరావు, మారేష్, యశోద, సీతమ్మ, లక్ష్మి రాము, శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

ఎండపల్లి గుట్టలో మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయాలి: సీపీఎం



ఎండపల్లి గుట్ట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకుల బృందం

మధిర రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి గుట్ట వద్దనుంచి అభివృద్ధిలో ముసుగులో వందల సంఖ్యలో టిప్పర్లలో మట్టి ని తరలిస్తున్నారని, మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు డిమాండ్ చేశారు. శనివారం మధిర మండలం ఎండపల్లి గుట్టను సీపీఎం నాయకుల బృందం పరిశీలించింది. అక్కడ మట్టి తవ్వకాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మధిర మండల ప్రజల వారసత్వ సంపద అయిన ఎండపల్లి గుట్ట నుంచి అక్రమంగా మట్టి తరలిపోవడం బాధాకరమన్నారు. వారసత్వ సంపదను కాపాడాలన్నారు. ఇక్కడి నుంచి అభివృద్ధి ముసుగులో ఖమ్మం, ఎన్టీఆర్ జిల్లాల్లోని పలు ప్రాంతాలకు పగలూ, రాత్రి తేడా లేకుండా మట్టిని తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. గుట్ట ప్రాంతంలో ఎక్కడ చూసినా భారీగా మట్టి తవ్విన గుంతలు కన్పిస్తున్నాయని, ఇంత మాఫియా నడుస్తున్నా కనీసం అధికార యంత్రాంగం కన్నెత్తి కూడా చూడకపోవడం దారుణమన్నారు. మట్టి తవ్వకాలు జరిపే ఎక్స్‌కవేటర్లకు ఎలాంటి నెంబర్లు కూడా లేవన్నారు. సామాన్య మానవుడు ఇంటి అవసరాలకు మట్టి తీసుకు వెళ్తేనే నానా ఇబ్బందులు పెట్టే అధికార యంత్రాంగం, మట్టి మాఫియా విషయంలో నోరుమెదపకపోవడం దారుణమన్నారు. అధికారులు, రాజకీయ నాయకులు భాగస్వాములై మట్టి దందా సాగిస్తున్నారని దీనిపై ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికైనా జిల్లా మైనింగ్, రెవెన్యూ అధికారులు స్పందించి తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శీలం నర్సింహారావు, మండల కార్యదర్శి మందా సైదులు, పట్టణ కార్యదర్శి పడకంటి మురళీ, మాజీ సర్పంచ్ మందడపు ఉపేంద్ర, తేలప్రోలు రాధాకృష్ణ, ఉద్దండుసాహెబ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న తాతా, సండ్ర

తల్లాడ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం అంజనాపురం గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పంపిణీ చేశారు. అంజనాపురానికి చెందిన భూక్యా వస్రాంకు రూ.30వేలు, భూక్యా దేవికి రూ.18వేల చొప్పున చెక్కులను వారు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకుడు కేతినేని చలపతిరావు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా ఇళ్లు ఇవ్వాలి

ముదిగొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం కోరారు. ముదిగొండలో జరుగుతున్న సర్వేలో భాగంగా శనివారం పంచాయతీ కార్యదర్శి రామకృష్ణను కలిసి రాజకీయాలకతీతంగా సర్వే నిర్వహించి పేదలకు ఇళ్ల మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మంకెన దామోదర్, మందరపు వెంకన్న, బట్టు రాజు, ఉసికల సతీష్, ఇరుకు నాగేశ్వరరావు, వేల్పుల లక్ష్మయ్య పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో వనసమారాధన

కారేపల్లి, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): మండల పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని గిద్దవారిగూడెం గ్రామం సమీపంలోని మామిడి తోటలో జరిగిన ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆటపాటలతో సందడి చేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాలినేని వెంకటరెడ్డి, వాంకుడోత్ మంగీలాల్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యలమద్ది వెంకటేశ్వర్లు, రంగరావు, ఏ.శంకర్, ఎల్. లక్ష్మణ్, పద్మావతి, విజయకుమార్, రత్నకుమార్ సీహెచ్. వెంకటేశ్వర్లు, బాబు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

వైరా, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపుసంఘం రాష్ట్ర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మున్నూరు కాపు సంఘం నేతలు ఆర్జేసీ కృష్ణ, కొత్తా సీతరాములు డిమాండ్ చేశారు. వైరాలో శుక్రవారం రాత్రి జరిగిన మున్నూరు కాపు సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక విషయాల్లో మున్నూరు కాపులు పటిష్ఠమైన స్థితిలో ఎదగాలని సూచించారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాపునేతలు అధిక సంఖ్యలో పోటీచేసి బలమైన శక్తిగా ఎదగాలని పేర్కొన్నారు. అదే క్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కట్ల రంగారావు, సంతోష్, ముళ్లపాటి సీతరాములు, పసుపులేటి నాసరయ్య, సైదారావు, మాజేటి రవి, పగడాల నరేందర్, లోకటి సురేష్, బాపట్ల మురళీ, మాదినేని ప్రసాద్, కామిశెట్టి రవి, ముదిగొండ్ల మహేష్, పాశం రవికుమార్, శ్యామ్, కట్ల కోటయ్య పాల్గొన్నారు.

మారనున్న మధిర రూపురేఖలు

మధిరటౌన్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో మధిర పట్టణ రూపురేఖలు మారనున్నాయని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ అన్నారు. శనివారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆదివారం మధిర పట్టణంలో రూ.19 కోట్లతో చేపట్టనున్న ఆరు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్న శిలాఫలకం, సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షుడు దుంపా వెంకటేశ్వర రెడ్డి, కౌన్సిలర్లు మల్లాది వాసు, కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు, గద్దల మాధురి, చిట్టిబాబు, మదార్, హరిబాబు, కర్నాటి రామారావు, నిడమానూరు వంశీ, పారుపల్లి విజయ్, దారా బాలరాజు, పాటిబండ్ల సత్యంబాబు, అద్దంకి రవి, జహంగీర్ పాల్గొన్నారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదర్శపీఠంలో అయ్యప్పల సందడి



ఇరుముడులు కడుతున్న గురుస్వాములు

కొణిజర్ల, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తనికెళ్ల గ్రామంలో గత 20 సంవత్సరాలుగా గ్రామంలోని మాల ధరించిన అయ్యప్పలు ఐక్యంతో ఒకే పీఠంలో పూజలు చేసుకూంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ముగ్గురు నుంచి మొదలైన మాలధారణ అయ్యప్పలు నేడు 236 మందికి చేరారు. ఇంత మంది మాలధరించి ఒకే పీఠంలో ఉంటూ పూజలు చేస్తున్నారు. జిల్లాలోనే కొణిజర్ల మండలం తనికెళ్ల అయ్యప్ప పీఠానికి ఎంతో పేరు వస్తుంది. గ్రామంలోని శ్రీ చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో 236 మంది భక్తులు అయ్యప్ప పీఠాన్ని ఏర్పాటు చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. గురుస్వాములు స్వాములందరికీ ఇరుముడులు కట్టారు. మాలధరించిన అయ్యప్పలు, గ్రామస్థులు, బంధువులు, స్నేహితులతో ఆలయం కిక్కిరిసిపోయింది. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ శనివారం ఇరుముడి కార్యక్రమానికి హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు సూరంపల్లి రామారావు, మండలాధ్యక్షుడు వడ్డే నారాయణరావు, చెరుకుమల్లి రవి, ఆత్మకమిటీ చైర్మన్ కోసూరు శ్రీను, రాయల పుల్లయ్య, చిరంజీవి, చింతనిప్పు నరసింహరావు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డిబోయిన ముత్తారావు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయకుంటే ఉద్యమిస్తాం

» సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు పుల్లయ్య

వైరా, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు పూర్తి స్థాయిలో రూ.రెండులక్షల రుణాలను వెంటనే మాఫీ చేయకుంటే ఉద్యమిస్తామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు సీవై.పుల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం వైరాలో జరిగిన పార్టీ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వెంటనే మంజూరు చేసి పేదలకు న్యాయం చేయాలని కోరారు. రైతులకు భరోసా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి కె.అర్జున్‌రావు, తడికమళ్ల సీతారాములు, యలదండి బాబు, పాశం అప్పారావు, షేక్.జానీ, బండారు భద్రయ్య, కన్నెగంటి వెంకటి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



వైరాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దళిత, గిరిజన, బలహీనవర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని ముసలిమడుగులో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో శనివారం నుంచి అమలులోకి వచ్చిన రోజువారి డైట్ మెనూను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థినులకు నాణ్యమైన విద్య, ఆహారాన్ని అందించేందుకు డైట్ చార్జీలను పెంచిందని పేర్కొన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, కట్ల రంగారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బీడీకే.రత్నం, దాసరి దానియేలు తదితరులున్నారు.

కల్లూరు, డిసెంబరు 14 (ఆంధజ్యోతి): కల్లూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం ప్రభుత్వం మెనూ చార్జిల పెంపు కార్యక్రమాన్ని ఆర్డీవో రాజేంద్రగౌడ్, ప్రత్యేకాధికారి సునీతలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో రత్తమ్మ, ప్రిన్సిపాల్ కనకదుర్గ, పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు కొలికపోగు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాలలో పిల్లలను తల్లిదండ్రుల వలే కంటికి రెప్పలా చూసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. వసతి గృహాలలో నూతన డైట్ మెనూ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డీపీవో విజయలక్ష్మి, స్పెషలాఫీసర్ మల్లికార్జున్, వార్డెన్ బీ.రాములు తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన సమాజంలా మారేందుకు ప్రభుత్వం చేపట్టిన కామన్ న్యూ డైట్ మెనూ ప్రోగ్రామ్‌తో నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందనుందని స్పెషల్ ఆఫీసర్ సునీల్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని టీజీ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలలో కామన్ న్యూ డైట్ మెనూ ప్రోగ్రామ్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీపీవో విజయలక్ష్మి, ఎంపీడీవో నాగేశ్వరరావు, ఐకేపీ ఏపీఎం కేవీ.సుబ్బారావు, ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య, పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీనవోలు గ్రామంలో సాంఘిక సంక్షేమ వసతిగృహంలో కామన్‌డైట్‌ను మండల ప్రత్యేక అధికారి కేవీ నారాయణ, ఎంపీడీవో బి.సురేందర్‌లు ప్రారంభించారు.

ఏన్కూరు, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మైనింగ్ శాఖ ఏడీ, మండల ప్రత్యేక అధికారి ఆర్. సాయినాథ్ తెలిపారు. శనివారం స్థానికగురుకుల పాఠశాలలో కామన్ మెనూ డైట్ చార్టును ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ఎస్. రమేష్, ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, ఏపీఎం చిన్న వెంకటేశ్వర్లు, ఏటీపీ సునిల్, వేమరాజు, డిప్యూటీ వార్డెన్ విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చింతకాని, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని డీఎస్‌వో చందన్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలోని బాలుర సంక్షేమ వసతిగృహాన్ని సందర్శించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు.



చింతకాని: విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న డీఎస్‌వో చందన్‌కుమార్



కల్లూరులో నృత్యం చేస్తున్న విద్యార్థులు



ఏన్కూర్‌లో మెనూ చార్టును ప్రారంభిస్తున్న దృశ్యం

జమలాపురం శ్రీవారికి ముత్యాల కవచ అలంకారం

ఎర్రుపాలెం, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించారు. ముత్యాల కవచ అలంకారంలో స్వామి వారు భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు, అయ్యప్ప మాలధారులకు ఉచితంగా అన్నవితరణ చేశారు. ఈకార్యక్రమంలో ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, సేవా సమితి నిర్వాహకులు ఎల్వీ నారాయణరెడ్డి, బొబ్బా ప్రసాద్, వి.వెంకటకృష్ణారావు, లీలాకృష్ణ, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

రైతుల చేతికి సంకెళ్లు వేయడం అమానుషం

» సీపీఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రా బాబు

వైరా, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): లగచర్ల కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న రైతుకు బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకువెళ్లడం అమానుషమని సీపీఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రా బాబు విమర్శించారు. శనివారం వైరా సీపీఐ కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న రైతు చేతులకు సంకెళ్ల వేసి ఆసుపత్రికి తీసుకువెళ్లడం సిగ్గుచేటని తీవ్రంగా ఖండించారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. కొండా రామకృష్ణ, మిట్టపల్లి రాఘవరావు పాల్గొన్నారు.